తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
మెదక్ - మహబూబ్‌నగర్
సంగారెడ్డి | సిద్దిపేట
జోగులాంబ గద్వాల
వనపర్తి | నారాయణపేట
నాగర్ కర్నూల్
మంగళవారం
06 అక్టోబర్ 2026

## విద్య, వైద్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

- **సంగారెడ్డిలో వికాస్ ఒకేషనల్ జూనియర్ కళాశాల ప్రారంభం**
- **రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ**



**సంగారెడ్డి బ్యూరో అక్టోబర్ 5 (జనంసాక్షి):** రాష్ట్ర ప్రభుత్వం విద్య వైద్యంపై ప్రత్యేక దృష్టి పెట్టిందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. సంగారెడ్డి పట్టణంలో వికాస్ ఒకేషనల్ జూనియర్ కళాశాలను రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల లోని వృత్తి శిక్షణ విభాగాలను మంత్రి పరిశీలించి, అందిస్తున్న కోర్సులు, శిక్షణ వివరాలను యాజమాన్యాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో ముఖాముఖిగా మాట్లాడారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విద్య, వైద్య రంగాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. విద్యార్థుల్లో వృత్తి నైపుణ్యాలను పెంపొందించేందుకు అవసరమైన శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థలను ఆధునికీకరిస్తున్నామని పేర్కొన్నారు.

నర్సింగ్ విద్యార్థులకు దేశ, విదేశాల్లో విస్తృతమైన అవకాశాలు ఉన్నాయని మంత్రి తెలిపారు. నర్సింగ్ విద్యార్థులకు జర్మన్, జపనీస్ భాషల్లో ప్రభుత్వం శిక్షణ అందిస్తోందన్నారు. విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానంతో పాటు వృత్తి నైపుణ్యం, భాషా ప్రావీణ్యాన్ని పెంపొందించుకొని ఉన్నత భవిష్యత్తును నిర్మించుకోవాలని ఆకాంక్షించారు. ఆధునిక సౌకర్యాలతో ఒకేషనల్ కళాశాలను ఏర్పాటు చేసిన యాజమాన్యాన్ని మంత్రి అభినందించారు.

## మల్కాపూర్‌లో తీవ్ర తాగునీటి కష్టాలు

- **8 రోజులుగా మూగబోయిన బోర్లు**



**కొండాపూర్, అక్టోబర్ 5 (జనంసాక్షి):** కొండాపూర్ మండల పరిధిలోని మల్కాపూర్ గ్రామంలో తాగునీటి సమస్య జటిలంగా మారింది. ముఖ్యంగా 3, 4వ వార్డుల్లో బోరు మోటార్లు పనిచేయకపోవడంతో గత ఎనిమిది రోజులుగా ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాలు ఆశించిన స్థాయిలో పడకపోవడంతో ఇప్పటికే నీటి లభ్యత తగ్గగా, ఉన్న బోర్లు కూడా నిలిచిపోవడంతో ఇతర ప్రాంతాలపై ఆధారపడాల్సి వస్తోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**పంచాయతీలోనే మోటార్లు.. తీరని నీటి తిప్పలు:**
చెడిపోయిన బోరు మోటార్లను బాగు చేయించాల్సింది పోయి, వాటిని గ్రామపంచాయతీ కార్యాలయానికే పరిమితం చేశారని వార్డు ప్రజలు ఆరోపిస్తున్నారు. సమస్య తీవ్రతను పంచాయతీ కార్యదర్శి మరియు పాలకవర్గం దృష్టికి తీసుకెళ్లినప్పటికీ, మరమ్మతులు చేయించడంలో జాప్యం వహిస్తూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వాపోతున్నారు.

**వెంటనే సరఫరా పునరుద్ధరించాలని డిమాండ్:**
తాగునీరు వంటి అత్యవసర సమస్యపై అధికారులు తక్షణమే స్పందించాలని గ్రామస్తులు కోరుతున్నారు. 3, 4వ వార్డుల్లో నిలిచిపోయిన బోరు మోటార్లకు వెంటనే మరమ్మతులు చేయించి నీటి సరఫరాను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తున్నారు. అలాగే ఈ సమస్య పరిష్కారంలో నిర్లక్ష్యం వహించిన బాధ్యులపై ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## రూ.48 కోట్లతో బిటి రోడ్డు పనులు ప్రారంభం

- **బిల్లులు రాక అవస్థలు పడుతున్న కాంట్రాక్టర్లు**
- **ఇది దివాలా కోరు ప్రభుత్వం: ఎమ్మెల్యే సునీతా రెడ్డి**



**శివ్వంపేట అక్టోబర్ 5 (జనంసాక్షి):** చేసిన పనులకు సకాలంలో కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో కొత్తగా పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి అన్నారు. శివ్వంపేట మండలం గంగాయిపల్లి నుంచి తండా మీదుగా చండి గ్రామం వరకు బీటీ రోడ్డు పనులను ఎమ్మెల్యే సోమవారం సర్పంచ్ రావెల్లి సాయిలుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాటి కేసీఆర్ ప్రభుత్వ హయాంలో మంజూరైన రూ.7 కోట్లతో మండలంలో ఏడు లింకు రోడ్లను బీటీ రోడ్లుగా మార్చుతున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని మారుమూల గ్రామాలు, తండాలకు రోడ్డు సౌకర్యం కల్పించేందుకు గత ప్రభుత్వం రూ.108 కోట్లు మంజూరు చేసిందని, అందులో 26 రోడ్లకు సంబంధించిన రూ.48 కోట్ల నిధులు నిలిచిపోయాయని ఆమె తెలిపారు. ఇది దివాలా కోరు ప్రభుత్వమని వెంటనే ఆ నిధులను విడుదల చేయాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు.

*మిగతా 10లో..*

## జాతీయ రహదారిపై మురుగు నీరు ప్రవాహం

- **సంగారెడ్డి చౌరస్తా బస్ స్టాప్ వద్ద ప్రవహిస్తున్న నీరు**
- **దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు**
- **20 రోజులైనా పట్టించుకోని సంబంధిత అధికారులు**



*మిగతా 10లో..*

**సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ 5 (జనంసాక్షి):** ఎప్పుడు రద్దీగా ఉండే 65వ జాతీయ రహదారి సంగారెడ్డి చౌరస్తా జనప్రియ హోటల్ ముందు నుంచి 20 రోజులుగా రోడ్డుపై డ్రైనేజీ వాటర్ ప్రవహిస్తున్న సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని ప్రయాణికులు మండిపడుతున్నారు.

## ఎండిపోయిన పంటలను పరిశీలించిన ఎమ్మెల్యే

- **నష్టపోయిన రైతులకు ఎకరాకు 25 వేల పరిహారం ఇవ్వాలి**
- **ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి**



**శివ్వంపేట,అక్టోబర్ 5 (జనంసాక్షి):** రైతులు సాగు చేసిన పంటలకు సక్రమంగా కరెంట్ ఇవ్వకపోవడంతో పంటలు ఎండిపోయి రైతులు హరిగోస పడుతున్నారని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం శివ్వంపేట మండలం గంగాయిపల్లి గ్రామంలో రైతులు గొల్ల భిక్షపతి యాదవ్, పెద్ద దాసరి రవిలకు చెందిన ఎండిపోయిన సుమారు 6 ఎకరాల వరి పంటలను ఆమె పరిశీలించారు. *మిగతా 11లో..*

## ప్రజావాణి దరఖాస్తులను ప్రాధాన్యతగా భావించి త్వరగా పరిష్కరించాలి

- **జిల్లా కలెక్టర్ కే.హైమావతి**



**సిద్దిపేట బ్యూరో, అక్టోబర్ 05 (జనంసాక్షి):** సోమవారం ఐడఓసి సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మి కిరణ్‌తో కలిసి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి వివిధ సమస్యలపై అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజావాణి కార్యక్రమానికి 85 అర్జీలు వచ్చాయి.

**ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..** ప్రజావాణి కార్యక్రమానికి వచ్చే ప్రతి దరఖాస్తులు నిశితంగా పరిశీలించి త్వరగా పరిష్కరించి ప్రజలకు న్యాయం చేయాలని సూచించారు. అదేవిధంగా సీఎం ప్రజావాణి కార్యక్రమం ద్వారా జిల్లాకు వచ్చిన దరఖాస్తులను ప్రత్యేక శ్రద్ధతో పరిశీలించి సమాచారం అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి నాగరాజమ్మ, ట్రైన్ డిప్యూటీ కలెక్టర్ భవ్య, వివిధ శాఖల జిల్లా అధికారుల తదితరులు పాల్గొన్నారు.

## రేపు గవర్నర్ పర్యటనకు ఏర్పాట్లు పూర్తి: జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

**మెదక్ బ్యూరో, అక్టోబర్ 5 (జనంసాక్షి):**
రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా మెదక్ జిల్లా పర్యటనకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని, అధికారులందరూ సమన్వయంతో పర్యటనను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో పర్యటన వివరాలను వెల్లడించారు.

**దేశంలోనే తొలిసారిగా భారీ ప్లాంటేషన్...**
రామాయంపేట-సిద్దిపేట మధ్య జాతీయ రహదారి 765డీజీ వెంట దేశంలోనే తొలిసారిగా 35 వేల జీడిమామిడి మొక్కలు నాటే భారీ కార్యక్రమానికి ఈ నెల 6న గవర్నర్ శ్రీకారం చుట్టనున్నారు. రోడ్డు వెంబడి అందుబాటులో ఉన్న భూమిని ఉత్పాదకంగా వినియోగిస్తూ పర్యావరణ సుస్థిరత, పచ్చదనాన్ని పెంపొందించడమే ఈ ప్రాజెక్టు ముఖ్య లక్ష్యం. సాయంత్రం 3.30 గంటలకు రామాయంపేటలోని అమోఘ్ హోటల్ సమీపంలో స్వామి వివేకానంద విగ్రహం వద్ద




మెదక్ ఎంపీ రఘునందన్ రావుతో కలిసి గవర్నర్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు.

**పర్యటన వివరాలు:**
**మధ్యాహ్నం 2:30 గంటలకు:** సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (IDOC) రాక.
**మధ్యాహ్నం 2:40 గంటలకు:** మాదకద్రవ్యాల నివారణపై అవగాహన పెంచే 'నషా ముక్త్ భారత్' ర్యాలీ ప్రారంభం మరియు విద్యార్థులతో ముఖాముఖి.
**మధ్యాహ్నం 2:50 గంటలకు:** ఐడీఓసీలో మహిళా శక్తి స్టాళ్ల సందర్శన, స్వయం సహాయక సంఘాల సభ్యులతో భేటీ.
**అనంతరం:** రెడ్‌క్రాస్ సొసైటీ నూతన ప్రతినిధు



లతో సమావేశం.
**సాయంత్రం 3:30 గంటలకు:** రామాయంపేటలో జీడిమామిడి మొక్కలు నాటే కార్యక్రమంలో భాగస్వామ్యం.

**పటిష్ట భద్రత:**
గవర్నర్ పర్యటన నేపథ్యంలో సెక్యూరిటీ, ట్రాఫిక్ నియంత్రణకు పటిష్ట భద్రతా చర్యలు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. సమావేశం అనంతరం ఐడీఓసీలో ఏర్పాట్లను అదనపు కలెక్టర్ అంబదాస్ రాజేశ్వర్, ఆర్డీవో రమాదేవి పరిశీలించారు. ఈ సమావేశంలో జిల్లా అటవీ అధికారి జోజి, డీఎస్పీ ప్రసన్న కుమార్, తహసీల్దార్ లక్ష్మణ్ బాబు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికే ప్రజావాణి: సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్





**సంగారెడ్డి, అక్టోబర్ 5 (జనంసాక్షి):** ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకే 'ప్రజావాణి' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ప్రజల నుంచి వచ్చిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి అర్హత మేరకు సత్వర పరిష్కారం చూపాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సంగీత, పాండులతో కలిసి కలెక్టర్ ప్రతీక్ జైన్ వినతులను స్వీకరించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన బాధితుల సమస్యలను ఆయన స్వయంగా అడిగి తెలుసుకుని, సంబంధిత అధికారులకు పంపించి తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...** అధికారులందరూ ప్రజల సమస్యల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి నిర్దిష్ట వ్యవధిలో పరిష్కరించాలని స్పష్టం చేశారు. జిల్లా ప్రజావాణి అర్జీలతో పాటు సీఎం ప్రజావాణికి సంబంధించిన పెండింగ్ దరఖాస్తులను కూడా వేగంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ వారం నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం 81 వినతులు అందినట్లు అధికారులు వెల్లడించారు.

**విభాగాలు & వినతుల వివరాలు:**

**కలెక్టరేట్:** 53, **సంగారెడ్డి డివిజన్:** 22, **నారాయణఖేడ్ డివిజన్:** 5, **జహీరాబాద్ డివిజన్:** 1, **అందోల్ డివిజన్:** 0 (ఏమీ అందలేదు) వచ్చిన ప్రతి అర్జీపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి సమస్యలకు తగిన పరిష్కారం చూపాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ జానకిరెడ్డి, బీసీ సంక్షేమాధికారి జగదీష్, సంగారెడ్డి ఆర్డీఓ రాజేందర్, జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్, పీడీ గృహ నిర్మాణ శాఖ చలపతిరావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ఎస్.బి. రామాచారి, జిల్లా సంక్షేమాధికారిణి లలిత కుమారి, అదనపు డీఆర్డీఓ బాలరాజ్‌తో పాటు పలు శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

# బీవీఆర్ఐటీలో ఘనంగా ఎం.టెక్ ఫ్రెషర్స్ ఇండక్షన్




**నర్సాపూర్, అక్టోబర్ 5 (జనంసాక్షి):** నర్సాపూర్ బీవీఆర్ఐటీ కళాశాలలో ఎం.టెక్ ప్రథమ సంవత్సరం విద్యార్థుల ఇండక్షన్ కార్యక్రమం సోమవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ ఛైర్మన్ కె. విష్ణురాజు మాట్లాడుతూ... విద్యార్థులు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ, పూర్వ విద్యార్థుల సహకారంతో కెరీర్‌లో ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. ప్రముఖ పరిశ్రమలతో ఒప్పందాల ద్వారా ఎం.టెక్ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లు, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని, ఐఐటీలతో కలిసి పరిశోధన సహకారాన్ని కొనసాగిస్తున్నామని వెల్లడించారు. విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ వైస్ ఛైర్మన్ రవిచంద్రన్ రాజగోపాల్ ఉన్నత విద్య, పీహెచ్‌డీ పరిశోధనల ప్రాధాన్యాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డా. కె.లక్ష్మీ ప్రసాద్, ప్రిన్సిపాల్ డా. సంజయ్ దూబే, అసోసియేట్ డైరెక్టర్ డా. వంశీ కృష్ణ, డీన్లు, విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

# బాధలో ఉన్న కుటుంబాలకు భరోసా...

## మృతుల కుటుంబాలను పరామర్శించిన కంఠారెడ్డి తిరుపతిరెడ్డి



**హవెలి ఘనపూర్ మండలం అక్టోబర్ 5 (జనంసాక్షి):** కష్టకాలంలో బాధిత కుటుంబాలకు అండగా ఉంటానని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి భరోసానిచ్చారు. హవెలి ఘనపూర్ మండలంలోని పలు గ్రామాల్లో ఆప్తులను కోల్పోయి విషాదంలో ఉన్న కుటుంబాలను ఆయన పరామర్శించారు.

బూరుపల్లి మాజీ సర్పంచ్ చెన్న గౌడ్ తండ్రి కిష్ట గౌడ్, సుల్తాన్‌పూర్ తండాకు చెందిన అరిగె శ్రావణి, అలాగే స్కూల్ తండాకు చెందిన బీఆర్ఎస్ యువ నాయకుడు రంజిత్ నాయక్ తండ్రి కేతావత్ రూప్‌సింగ్ నాయక్ ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న తిరుపతిరెడ్డి ఆయా గ్రామాలకు వెళ్లి మృతుల పార్థివదేహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి, వారికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఈ పరామర్శ కార్యక్రమాల్లో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కసిరెడ్డి మాణిక్యారెడ్డి, స్థానిక సర్పంచులు, ఉపసర్పంచులు, మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గాగిల్లాపూర్‌లో పోషణ మాసం కార్యక్రమం



**బెజ్జంకి, అక్టోబర్ 5 (జనంసాక్షి):** బెజ్జంకి మండలం గాగిల్లాపూర్‌లోని అంగన్వాడీ కేంద్రంలో సోమవారం 'పోషణ మాసం' కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ సర్పంచ్ ఎర్రల జానకిరాజు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గర్భిణులు, బాలింతలు పోషకాహారంతో పాటు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఏఎన్ఎం రాధ ఆరోగ్యం, ఆహార జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ పద్మ, అంగన్వాడీ సిబ్బంది శారద, కనకవ్వ, ఉపాధ్యాయులు మరియు బాలింతలు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీ పారిశుద్ధ్య

# కార్మికురాలు ఆకస్మికంగా మృతి



**సిర్గాపూర్ అక్టోబర్ 5 (జనంసాక్షి):** సిర్గాపూర్ గ్రామం పరిశుద్ధ కార్మికురాలుగా మేత్రి మల్లమ్మ (40) సంవత్సరం అనారోగ్యం క్యాన్సర్‌తో సోమవారం మృతిచెందారు. ఆమె మృతి పట్ల సర్పంచ్ శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ భిక్షపతి, సంతపం తెలిపారు. ఆ గ్రామానికి చెందిన మేత్రి మల్లమ్మ ఆమె అందించిన సేవలు గుర్తు చేసుకున్నారు. మల్లమ్మ కుటుంబ సభ్యులకు వార్డు సభ్యులు, గ్రామస్తులు సానుభూతి తెలిపారు.

## ఆపన్నహస్తం కోసం

# ఎదురుచూస్తున్న వితంతు కుటుంబం



**చిన్న శంకరంపేట, అక్టోబర్ 5 (జనంసాక్షి):** చిన్నశంకరంపేట మండలం ఖాజాపూర్‌కు చెందిన నీల శేఖర్ ఇటీవల పొలంలో ఫిట్స్ వచ్చి ఆకస్మికంగా మృతి చెందారు. భర్త మరణంతో భార్య వినోద, ఇద్దరు కూతుళ్లు వైశాలి (ఇంటర్), అవనిజ (5వ తరగతి) దిక్కుతోచని స్థితిలో పడ్డారు. సొంత ఇల్లు లేక కిరాయింట్లో ఉంటున్న వీరికి కేవలం 8 గుంటల భూమి మాత్రమే ఉండటంతో, రోజు కూలిపనిపైనే ఆధారపడుతున్నారు. తమ కుటుంబాన్ని ఆదుకోవడానికి దాతలు, ప్రభుత్వం ముందుకు రావాలని వినోదతో పాటు గ్రామస్తులు కోరుతున్నారు.

# ధర్మబద్ధంగా విద్యను బోధించేది గురువులే

• తూప్రాన్ మున్సిపల్ చైర్మన్



**తూప్రాన్, అక్టోబర్ 5(జనంసాక్షి):** ధర్మబద్ధంగా విద్యను బోధిస్తూ విద్యార్థులను ఉన్నత స్థానాల్లో నిలిపేది గురువులేనని తూప్రాన్ మున్సిపల్ చైర్మన్ బొంది రజిని రవీందర్ గౌడ్ కొనియాడారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. ఎంఈఓ సత్యనారాయణ మాట్లాడుతూ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోవడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పలువురు సర్పంచులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# రైతులకు 24 గంటల విద్యుత్ ఇవ్వాలి

• బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు



**సదాశివపేట, అక్టోబరు 5(జనంసాక్షి):** రైతులకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని సదాశివపేట మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు పెద్దగొల్ల ఆంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యుత్ కోతలతో పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొందని, రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 24 గంటల ఉచిత విద్యుత్ అందించామని పేర్కొంటూ, ప్రస్తుతం కోతలను వెంటనే నివారించి వ్యవసాయానికి నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని కోరారు.

# కామాఖ్య అమ్మవారిని దర్శించుకున్న బీఆర్ఎస్ నేత శివరాజ్ పాటిల్



**సదాశివపేట, అక్టోబర్ 5(జనంసాక్షి):** అస్సాంలోని ప్రసిద్ధ కామాఖ్య దేవి శక్తిపీఠాన్ని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు శివరాజ్ పాటిల్ పార్టీ నాయకులతో కలిసి దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. BRS పార్టీ తిరిగి అధికారంలోకి రావాలని, కేసీఆర్ మళ్లీ సీఎం కావాలని నియోజకవర్గం సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు అమరేందర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్లు విద్యాసాగర్‌రెడ్డి, ఇంద్రమోహన్‌గౌడ్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

# తడి, పొడి చెత్తను వేరు చేయాలి

• సర్పంచ్ అరుణ రెడ్డి



**శివ్వంపేట అక్టోబర్ 5 (జనంసాక్షి):** సికింద్లాపూర్ గ్రామంలో సోమవారం గ్రామస్తులకు సర్పంచ్ దొంతిరెడ్డి అరుణ సురేందర్ రెడ్డి తడి, పొడి చెత్త బుట్టలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం సాధ్యమవుతుందని, ప్రజలందరూ ఇళ్లను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. తడి, పొడి చెత్తను ఇంట్లోనే వేరు చేసి పంచాయతీ కార్మికులకు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ప్రభాకర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి బలరాం రెడ్డి, వార్డు సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

# హుసెల్లీలో ఉచిత వైద్య శిబిరం

• 'మమత అకాడమీ' ఆధ్వర్యంలో సేవలు



**న్యాల్‌కల్, అక్టోబర్ 05 (జనంసాక్షి):** బాచుపల్లి 'మమత అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్సెస్' సౌజన్యంతో న్యాల్‌కల్ మండలంలోని హుసెల్లీ గ్రామ పంచాయతీ ఆవరణలో సర్పంచ్ రేవంత్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి గ్రామస్తుల నుంచి అనూహ్య స్పందన లభించింది.

డాక్టర్ రిత్విక్ రెడ్డి, డాక్టర్ రితుషా నేతృత్వంలోని వైద్య బృందం 180 మందికి పైగా రోగులకు సాధారణ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

మెరుగైన చికిత్స అవసరమైన వారిని ఆసుపత్రి వాహనాల్లో ఉచితంగా తీసుకెళ్లి వైద్యమందించనున్నట్లు తెలిపారు. గర్భిణులకు ఉచిత కాన్పులతో పాటు ఉచిత పరీక్షలు, బెడ్, భోజనం, రవాణా సౌకర్యాలు కల్పిస్తున్నామని, ఈ వైద్య సేవలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ రిత్విక్ రెడ్డి కోరారు.

## పల్లె పల్లెకు పొన్నమన్న:
## 'ప్రజా పాలన'ను విజయవంతం చేయండి

• కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు శెట్టి సుధాకర్



**కోహెడ అక్టోబర్ 05 (జనంసాక్షి):** మండలంలోని వివిధ గ్రామాలలో మంగళవారం రోజున ఉదయం 9:00 గంటల నుండి పల్లె పల్లెకు - పొన్నమన్న పల్లె - పల్లెల్లో ప్రజా పాలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ మండల అధ్యక్షులు శెట్టి సుధాకర్ సోమవారం ఒక ప్రకటన లో తెలిపారు. కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర రవాణా , బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మండలంలోని పరివేద, నకిరే కొమ్ముల, శ్రీరాముల పల్లి, సీసీ పల్లి,కాచాపూర్,మైసంపల్లి గ్రామాలకు విచ్చేసి ప్రజా సమస్యలను తెలుసుకొని అట్టి సమస్యలను పరిష్కరించే దిశగా ప్రజల వద్దకే వస్తున్న సందర్భంగా ఆయా గ్రామాల ముఖ్య నాయకులు, నాయకులు, పార్టీ అధ్యక్షులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని పేర్కొన్నారు.విజయవంతం చేయండి.

## గీత కార్మికుల
## పింఛన్ల గడువు పెంపునకు వినతి

**కొండపాక, అక్టోబర్ 5 (జనంసాక్షి):** కొండపాక ప్రజావాణిలో కల్లుగీత కార్మికుల పింఛన్ల దరఖాస్తు గడువు పెంచాలని కోరుతూ మండల అధ్యక్షులు చింతల సాయిబాబా గౌడ్, గౌడ సంఘాల సమితి రాష్ట్ర కో-కన్వీనర్ అంబటి బాలచందర్ గౌడ్ అధికారులు వినతిపత్రం ఇచ్చారు. అర్హులైన ప్రతి గీత కార్మికుడికి ఎలాంటి ఆంక్షలు లేకుండా పింఛన్ మంజూరు చేయాలని ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజా గౌడ్, కనకరాజు గౌడ్, శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

## శేరిపల్లిలో
## మహిళా సమైక్య భవనానికి భూమి పూజ



**నార్సింగి, సెప్టెంబర్ 05 (జనంసాక్షి):** నార్సింగి మండల పరిధిలోని శేరిపల్లి గ్రామంలో మహిళా సమైక్య భవన నిర్మాణానికి సోమవారం భూమిపూజ నిర్వహించారు. మహిళల సమావేశాలు, శిక్షణ, ఆర్థిక-సామాజిక అభివృద్ధికే ఈ భవనం దోహదపడుతుందని నిర్వాహకులు తెలిపారు. మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం సృజన్ కుమార్ రెడ్డి, మండల సమైక్య అధ్యక్షురాలు నవనీత, ప్రజా ప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

## అభివృద్ధికి పెద్దపీట



**అమీన్పూర్, అక్టోబర్ 5(జనంసాక్షి):** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధికి పెద్దపీట వేస్తుందని కాంగ్రెస్ పార్టీ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు శశిధర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం బీరంగూడ డివిజన్ పరిధిలోని మారుతి నగర్ కాలనీలో అధికారులతో కలిసి సిసి రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీవాసులు తమ కాలనీలో సీసీ రోడ్డు నిర్మించాలని కోరినట్లు తెలిపారు. కాలనీ సమస్యను నియోజకవర్గ ఇన్చార్జి కాటా శ్రీనివాస్ గౌడ్, అధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. నిధులు మంజూరు చేసి సోమవారం రోడ్డు పనులను ప్రారంభించారు. రోడ్డు పనులు ప్రారంభం కావడంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు.

# ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తున్న బీజేపీ

• 'ఇండియా' కూటమి నేతల మండిపాటు
• సార్ ప్రక్రియను రద్దు చేయాలి
• సిఈసి జ్ఞానేష్ కుమార్ మిశ్రాను తొలగించాలి
• జ్ఞానేష్ కుమార్‌ను అరెస్టు చేయాలి
• తొలగించిన ఓట్లను వెంటనే పునరుద్ధించాలి
• ఓటు చోరీకి పాల్పడుతున్న బిజెపికి గుణపాఠం చెప్పాలి
• ఓట్లను కాపాడుకోవాలంటే ఉద్యమం తప్పదు
• నేడు జిల్లా కలెక్టర్ కార్యాలయం ముట్టడి
• ఇండియా కూటమి ఆధ్వర్యంలో సమావేశం
• డిసిసి అధ్యక్షులు పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి
• వామపక్ష పార్టీలతో సమావేశం



**సంగారెడ్డి అక్టోబర్ 05 (జనంసాక్షి):** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 'సార్' (SIR) ప్రక్రియ ద్వారా ఓటు చోరీకి పాల్పడుతూ దేశంలో సుమారు 13 కోట్ల ఓట్లను తొలగించిందని, అందులో సంగారెడ్డి జిల్లాలోనే దాదాపు 3 లక్షలకు పైగా ఓట్లు ఉన్నాయని 'ఇండియా' కూటమి నేతలు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఓట్ల తొలగింపు ద్వారా ప్రజాస్వామ్య హక్కులను బీజేపీ కాలరాస్తోందని, తొలగించిన ఓట్లను వెంటనే పునరుద్ధరించాలని వారు డిమాండ్ చేశారు.

సోమవారం సంగారెడ్డిలో డిసిసి అధ్యక్షుడు పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్, సిపిఐ, సిపిఎం, టీజేఎస్, ఏఐఎఫ్‌బి, ఎంసిపిఐ(యు) తదితర వామపక్ష పార్టీల ప్రతినిధులతో కూడిన 'ఇండియా' కూటమి విలేకరుల సమావేశం నిర్వహించింది.

**ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ...** కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సిఈసి) జ్ఞానేష్ కుమార్ బీజేపీ ప్రభుత్వానికి తొత్తుగా మారారని, రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును భంగపరుస్తూ మైనార్టీలు మరియు బీజేపీకి వ్యతిరేకంగా ఉన్న ఓట్లను కావాలనే తొలగించారని మండిపడ్డారు. ఈ అన్యాయానికి బాధ్యులైన జ్ఞానేష్ కుమార్‌ను వెంటనే పదవి నుంచి తొలగించి, సస్పెండ్ చేయడంతో పాటు అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. 'సార్' ప్రక్రియను వెంటనే రద్దు చేయాలని స్పష్టం చేశారు. మన ఓటు హక్కును కాపాడుకోవడానికి ఉద్యమించడం తప్ప వేరే మార్గం లేదని పిలుపునిస్తూ... బీజేపీకి తగిన గుణపాఠం చెప్పేందుకు సమరశంఖం పూరించారు. ఇందులో భాగంగా నేడు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన, అలాగే 'ఛలో రాజ్ భవన్', నవంబర్ 1న 'ఛలో ఢిల్లీ' కార్యక్రమాలను చేపడుతున్నట్లు నేతలు వెల్లడించారు.

ఈ సమావేశంలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత కిషన్, సిపిఎం కార్యదర్శి జయరాజ్, సిపిఐ నాయకుడు రహమాన్, టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు తుల్జా రెడ్డి, ఏఐఎఫ్‌బి అధ్యక్షుడు చిరంజీవి, ఎంసిపిఐ (యు) అధ్యక్షుడు కుమార్, గ్రంథాలయ చైర్మన్ అంజయ్య, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కిరణ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కూన సంతోష్, ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పోలీస్ ఉద్యోగాల కోసం ఉచిత శిక్షణ

• అక్టోబర్ 10 నుంచి 45 రోజుల పాటు నిర్వహణ
• అర్హులైన యువత సద్వినియోగం చేసుకోవాలి : కోహిర్ ఎస్.ఐ. నరేష్



**కోహిర్, అక్టోబరు 5 (జనంసాక్షి):** పోలీస్ శాఖలో ఉద్యోగాలు సాధించాలనే లక్ష్యంతో సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతకు జహీరాబాద్‌లో ఉచిత పోలీస్ రిక్రూట్‌మెంట్ కోచింగ్ నిర్వహించనున్నట్లు కోహిర్ ఎస్ఐ తెలిపారు. సంగారెడ్డి జిల్లా కలెక్టర్, ఎస్పీ ఆధ్వర్యంలో అక్టోబరు 10వ తేదీ నుంచి 45 రోజుల పాటు ఈ ఉచిత శిక్షణ కార్యక్రమం కొనసాగుతుందని పేర్కొన్నారు.కానిస్టేబుల్, సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఈ శిక్షణ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఎస్ఐ తెలిపారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసిన అర్హులు కానిస్టేబుల్ పోస్టులకు, డిగ్రీ పూర్తి చేసిన అర్హులు సబ్ ఇన్‌స్పెక్టర్ పోస్టులకు సంబంధించిన శిక్షణను పొందవచ్చని వివరించారు.

**అక్టోబరు 3 నుంచి 7 వరకు దరఖాస్తులు**

ఉచిత కోచింగ్‌కు అర్హత కలిగిన అభ్యర్థులు అక్టోబరు 3 నుంచి 7వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. సంబంధిత పోలీస్ స్టేషన్‌లో మాన్యువల్ ఫామ్ ద్వారా దరఖాస్తు చేసుకోవడంతో పాటు, అందుబాటులో ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి ఆన్‌లైన్‌లో కూడా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందన్నారు. దరఖాస్తులు స్వీకరించిన అనంతరం అర్హత కలిగిన అభ్యర్థులను ఎంపిక చేసి జహీరాబాద్‌లో ఉచిత పోలీస్ రిక్రూట్‌మెంట్ కోచింగ్ అందించనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులకు అవసరమైన స్టడీ మెటీరియల్‌ను కూడా ఉచితంగా అందజేయనున్నట్లు తెలిపారు.

**నిపుణులైన ఫ్యాకల్టీతో శిక్షణ**

అభ్యర్థులకు మెరుగైన శిక్షణ అందించేందుకు హైదరాబాద్ నుంచి ప్రత్యేకంగా నిపుణులైన ఫ్యాకల్టీని రప్పించి కోచింగ్ నిర్వహించనున్నట్లు ఎస్ఐ వెల్లడించారు. రాత పరీక్షతో పాటు పోలీస్ ఉద్యోగాల ఎంపిక ప్రక్రియకు అవసరమైన అంశాలపై అభ్యర్థులకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. కోహిర్ మండలంతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన అర్హులైన యువత ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఐ, నరేష్, సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ ఉచిత శిక్షణను ఉపయోగించుకుని అభ్యర్థులు కష్టపడి చదివి పోలీస్ శాఖలో ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని ఆయన ఆకాంక్షించారు.

## గ్రామసభ నిర్వహించి
## అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

• సర్పంచ్ కృష్ణ ముదిరాజ్



**కంగ్టి, అక్టోబర్ 5 (జనంసాక్షి):** ఇందిరమ్మ ఇళ్లను గ్రామసభ నిర్వహించి అసలైన నిరుపేదలకే కేటాయించాలని కంగ్టి సర్పంచ్ కృష్ణ ముదిరాజ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఎంపీడీఓ దయాకర్ రావుకు వినతిపత్రం అందజేశారు. సర్పంచ్‌లకు సమాచారం ఇవ్వకుండా, పంచాయతీరాజ్ చట్టాన్ని ఉల్లంఘిస్తూ పార్టీల వారీగా ఇళ్ల ఎంపిక ప్రక్రియ చేపడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో నిబంధనలకు విరుద్ధంగా రూపొందించిన ఇందిరమ్మ ఇండ్ల లిస్టును వెంటనే నిలిపివేయాలని కోరారు. గ్రామంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులతో కలిసి గ్రామసభ ఏర్పాటు చేసి నిజమైన అర్హులను గుర్తించాలన్నారు.

## శివ్వంపేటలో ఘనంగా గణపతి నిమజ్జనోత్సవం

• ఆకట్టుకున్న కాశీ హారతి





**శివ్వంపేట, అక్టోబర్ 5 (జనంసాక్షి):** శివ్వంపేటలో శివశక్తి యువజన సంఘం ఆధ్వర్యంలో గణనాథుని నిమజ్జనోత్సవం సోమవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కాశీ క్షేత్రం నుండి విచ్చేసిన వేద పండితులు నిర్వహించిన గంగా హారతి, నక్షత్ర హారతి మరియు చామర విచయం కార్యక్రమాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. గ్రామ మహిళలు, పౌరులు ఈ హారతి మహోత్సవాన్ని కన్నులారా తిలకించి తన్మయత్వం పొందారు.

ఈ కార్యక్రమానికి మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు రెడ్డిపల్లి ఆంజనేయులు గౌడ్, రాష్ట్ర నాయకుడు చిట్కుల మహిపాల్ రెడ్డి తదితరులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కొడకంచి శ్రీనివాస్ గౌడ్, శివశక్తి యువజన సంఘం అధ్యక్షుడు కొడకంచి శివప్రసాద్ గౌడ్ల నేతృత్వంలో ఈ కార్యక్రమాలు జరిగాయి.

ఈ సందర్భంగా మైనంపల్లి హనుమంతరావు మాట్లాడుతూ... నిమజ్జనోత్సవాలను శాంతియుతంగా, భక్తిభావంతో జరుపుకోవాలని సూచించారు. కాశీ వేద పండితులు మన గ్రామానికి వచ్చి హారతి ఇవ్వడం పూర్వజన్మ సుకృతమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, యువజన సంఘ సభ్యులు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నవంబర్ నాటికి రైతులకు ప్లాట్లు కేటాయించాలి

- **హెచ్ఎండీఏ సమీక్షలో కలెక్టర్**





**సంగారెడ్డి, అక్టోబర్ 5 (జనంసాక్షి):** సంగారెడ్డి నియోజకవర్గ పరిధిలోని భూసమీకరణ లేఅవుట్లపై జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సోమవారం కలెక్టరేట్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, నిర్మల జగ్గారెడ్డితో పాటు హెచ్ఎండీఏ, రెవెన్యూ శాఖల అధికారులు పాల్గొన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఆరుట్ల, ఇంద్రకరణ్, ఫసల్‌వాది, కంది ప్రాంతాల్లో భూసమీకరణ కింద రైతుల నుంచి భూములు తీసుకుని పత్రాలు ఇచ్చినప్పటికీ, ఇప్పటి వరకు ప్లాట్లు స్వాధీనం చేయలేదని జగ్గారెడ్డి దంపతులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. రైతులు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్నందున జాప్యం లేకుండా ప్లాట్లు కేటాయించాలని కోరారు.

**లేఅవుట్ల వారీగా ప్రస్తుత పరిస్థితి:**

**ఆరుట్ల:** 106 ఎకరాల 14 గుంటల్లో లేఅవుట్ పూర్తయినా, లబ్ధిదారుల జాబితా రావాల్సి ఉంది.

**ఫసల్‌వాది:** 60 శాతం భూసేకరణ పూర్తయింది; కొంత భూమిపై రైతుల అభ్యంతరాలు ఉన్నాయి.

**కంది:** 50 ఎకరాలకు గాను 46 ఎకరాలు అందుబాటులో ఉన్నాయని, ఈ నెల 10 నాటికి పనులు పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు.

**ఇంద్రకరణ్:** ఇక్కడ కూడా రైతులు ఎదురుచూస్తున్న దృష్ట్యా సమస్యలను త్వరితగతిన పరిష్కరించనున్నారు.

**అధికారుల హామీ & కలెక్టర్ ఆదేశాలు:**

కంది, ఫసల్‌వాది, ఆరుట్ల లేఅవుట్లలో భూములు కోల్పోయిన లబ్ధిదారులకు నవంబర్ నెలాఖరుకల్లా ప్లాట్లు కేటాయిస్తామని హెచ్ఎండీఏ అధికారులు సమావేశంలో హామీ ఇచ్చారు.

**దీనిపై స్పందించిన కలెక్టర్ ప్రతీక్ జైన్...** హెచ్ఎండీఏ, రెవెన్యూ అధికారులు సమన్వయంతో పనిచేసి నవంబర్ చివరినాటికి ప్రక్రియను ముగించాలని ఆదేశించారు. రైతులకు ఇచ్చిన హామీ మేరకు పనుల్లో వేగం పెంచి సమస్యలను వెంటనే పరిష్కరించాలని స్పష్టం చేశారు.

# జర్నలిస్టుల సంక్షేమానికి రూ. 42 కోట్లు తెచ్చిన ఘనత టీయూడబ్ల్యూజేదే

- **టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతి సాగర్**

**నారాయణఖేడ్, అక్టోబర్ 05 (జనంసాక్షి):** జర్నలిస్టుల సంక్షేమం కోసం రూ. 42 కోట్లు తీసుకువచ్చిన ఘనత తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ (టీయూడబ్ల్యూజే)కే దక్కుతుందని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతి సాగర్ స్పష్టం చేశారు. నారాయణఖేడ్‌లో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. 2001లో తెలంగాణ ఉద్యమ సమయంలో ఆవిర్భవించిన తమ సంఘం, 25 వసంతాలు పూర్తి చేసుకుని జర్నలిస్టుల హక్కులు మరియు సంక్షేమం కోసం నిరంతరం పోరాడుతోందని పేర్కొన్నారు. అల్లం నారాయణ నేతృత్వంలో ఇళ్ల స్థలాలు, అక్రిడిటేషన్ కార్డుల సాధనకు కృషి చేశామని గుర్తుచేశారు. కరోనా సమయంలో ప్రత్యేకాధికారాలతో రూ. 7 కోట్ల నిధులతో 3,980 మంది జర్నలిస్టుల ఖాతాల్లో నేరుగా ఆర్థిక సహాయం అందించామన్నారు.

అలాగే రాష్ట్రవ్యాప్తంగా మరణించిన సుమారు 5,000 మంది జర్నలిస్టుల కుటుంబాలకు తక్షణ సహాయంగా రూ. 1 లక్ష చొప్పున అందించడమే కాకుండా, వారి కుటుంబాలకు రూ. 2,000 పింఛన్ మరియు పిల్లల చదువుల కోసం రూ. 3,000 (మొత్తం రూ. 5,000) నెలానెలా అందిస్తున్న ఏకైక సంఘం టీయూడబ్ల్యూజే అని చెప్పారు.

గతంలో తమ యూనియన్ పోరాటాల ఫలితంగా 25 వేల మందికి అక్రిడిటేషన్ కార్డులు వస్తే, ప్రస్తుత ప్రెస్ అకాడమీ చైర్మన్ పదివేల మందికి కూడా ఇప్పించలేకపోయారని విమర్శించారు. అడ్డదిడ్డంగా చీకటి జీవోలు తెచ్చి జర్నలిస్టులకు కార్డులు రాకుండా కాలయాపన చేస్తున్నారని దుయ్యబట్టారు. ఏదేమైనా జర్నలిస్టుల సమస్యలపై టీయూడబ్ల్యూజే క్రమశిక్షణ, ఐక్యతతో ముందుకు సాగుతుందని స్పష్టం చేశారు.



ఈ కార్యక్రమంలో ఎలక్ట్రానిక్ మీడియా రాష్ట్ర అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి, ఉమ్మడి మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శి యాదగిరి గౌడ్, రాష్ట్ర నాయకులు తిరుపతి నాయక్, పరశురామ్ రాజు, వేణు, పటాన్‌చెరు నూతన అధ్యక్షుడు రాఘవరెడ్డి, నగేష్, నారాయణఖేడ్ నియోజకవర్గ అధ్యక్షుడు అమృతం తదితరులు పాల్గొన్నారు.

# పెద్ద చింతరేవులలో పట్టపగలే దొంగతనం

- **ఇంటికి తాళం వేసి వెళ్లిన సమయంలో చోరీ**



**ధరూర్ మండలం, అక్టోబర్ 05 (జనంసాక్షి):** ధరూర్ మండలంలోని పెద్ద చింతరేవుల గ్రామంలో పట్టపగలే దొంగతనం చోటుచేసుకుంది. ఇంటి యజమానులు బయటకు వెళ్లిన సమయంలో గుర్తుతెలియని దుండగులు ఇంటి తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించారు. అనంతరం ఇంట్లో ఉన్న నగదు, బంగారు ఆభరణాలు మరియు విలువైన వస్తువులను అపహరించి పరారయ్యారు.

సాయంత్రం ఇంటికి వచ్చిన కుటుంబ సభ్యులు ఇంటి తలుపులు తెరిచి ఉండటం గమనించి లోపల పరిశీలించగా చోరీ జరిగిన విషయం వెలుగులోకి వచ్చింది. వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలాన్ని పరిశీలించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గ్రామంలో వరుస దొంగతనాలపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తూ రాత్రి వేళల్లో పోలీసు గస్తీని మరింత పెంచాలని కోరుతున్నారు.

## టీఎస్‌జీహెచ్ఎంఏ గౌరవ అధ్యక్షుడిగా ఎంఈఓ జనార్దన్ రెడ్డి: ఘన సన్మానం



**కొత్తపల్లి అక్టోబర్ 5 (జనంసాక్షి):** టీఎస్‌జీహెచ్ఎంఏ గౌరవ అధ్యక్షుడిగా ఎన్నికైన మద్దూరు ఎంఈఓ జనార్దన్ రెడ్డిని మండల పీఆర్‌టీయూటీఎస్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్ రెడ్డి నేతృత్వంలో ఆయనను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. జనార్దన్ రెడ్డి ఎన్నిక కావడం మండలానికి గర్వకారణమని, ఉపాధ్యాయుల సంక్షేమం, విద్యారంగ అభివృద్ధికి ఆయన మరింత కృషి చేయాలని నాయకులు ఆకాంక్షించారు.

## తూప్రాన్‌లో ఘనంగా గురుపూజోత్సవం



**తూప్రాన్, అక్టోబర్ 5 (జనంసాక్షి):** తూప్రాన్‌లోని లక్ష్మీ గార్డెన్స్‌లో ఎంఈఓ డా. పార్వతి సత్యనారాయణ అధ్యక్షతన మండల స్థాయి గురుపూజోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. సమాజ నిర్మాణంలో కీలకపాత్ర పోషిస్తున్న ఉపాధ్యాయుల సేవలను కొనియాడుతూ వారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్‌పర్సన్ బొంది రజని హాజరయ్యారు. ఈ వేడుకలో వైస్ చైర్‌పర్సన్ సమతా కాశిరెడ్డి, సర్పంచుల ఫోరమ్ అధ్యక్షుడు సంతోష్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వాసకుంటకు సాగునీరందించి పంటలను కాపాడాలి: సీపీఎం డిమాండ్

**అమరచింత, అక్టోబర్ 5 (జనంసాక్షి):** భూత్పూర్ రిజర్వాయర్ D-20 కాలువ ద్వారా అమరచింత మండలంలోని పామ్‌రెడ్డిపల్లి గ్రామ శివారులో ఉన్న వాసకుంటను నీటితో నింపాలని సీపీఎం నాయకులు బి. వెంకటేష్, శంకర్, మోహన్ కోరారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. వర్షాభావం వల్ల భూగర్భ జలాలు అడుగంటి బోర్లు ఎండిపోతున్నాయని, వాసకుంట పరిధిలోని 1,600 ఎకరాల పంటలు ఎండిపోయే ప్రమాదం ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు తక్షణమే స్పందించి వాసకుంటకు నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు రాజు, కే. నరసింహ, వేణు తదితరులు పాల్గొన్నారు.

## తుక్కాపూర్ బ్రిడ్జి మీదుగా ఆర్టీసీ బస్సులు నడపాలి

- **తుక్కాపూర్ గ్రామ సర్పంచ్ దొడ్డ ఆంజనేయులు**




**కొల్చారం, అక్టోబర్ 05 (జనంసాక్షి):** తుక్కాపూర్ బ్రిడ్జి మీదుగా నూతన ఆర్టీసీ బస్సు సర్వీసులను ప్రారంభించాలని తుక్కాపూర్ సర్పంచ్ దొడ్ల ఆంజనేయులు కోరారు.

సోమవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కొల్చారం, పాపన్నపేట, టేక్మాల్, అల్లాదుర్గం, పెద్దశంకరంపేట మండలాల ప్రజలు, విద్యార్థులు సరిపడా బస్సులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పెరుగుతున్న ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా వెంటనే ప్రజా రవాణా సౌకర్యాన్ని మెరుగుపరచాలని విజ్ఞప్తి చేశారు.

## చేర్యాలలో వార్డు మెంబర్లకు అవగాహన సదస్సు



**చేర్యాల, అక్టోబర్ 05 (జనంసాక్షి):** చేర్యాల మండలం ముస్త్యాల రైతు వేదికలో ఎంపీడీవో అనభేరి ప్రణయ్ ఆధ్వర్యంలో వార్డు సభ్యుల శిక్షణ తరగతులు సోమవారం ప్రారంభమయ్యాయి. స్థానిక పాలనపై అవగాహ న కల్పించేందుకు శిక్షణను రెండు విడతల్లో నిర్వహిస్తున్నారు. మొదటి విడతలో అక్టోబర్ 5 నుంచి 9వరకు పది గ్రామాల సభ్యులకు, రెండో విడతలో అక్టోబర్ 12 నుంచి 16 వరకు మిగిలిన పది గ్రామాల సభ్యులకు శిక్షణ ఇవ్వనున్నారు.

## కరాటే, కుంగ్‌ఫూ పోటీల్లో ఎస్‌ఆర్ పాఠశాల విద్యార్థుల ప్రతిభ



**తెలకపల్లి, అక్టోబర్ 05 (జనంసాక్షి):** అచంపేటలో నిర్వహించిన డివిజన్ స్థాయి కరాటే, కుంగ్‌ఫూ ఛాంపియన్‌షిప్-2026లో తెలకపల్లి ఎస్‌ఆర్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. ముకేష్ మాస్టర్, ఏఆర్ స్పోర్ట్స్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీల ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో ఎస్‌ఆర్ పాఠశాల ఓవరాల్ ద్వితీయ బహుమతి సాధించగా, పలువురు విద్యార్థులు వ్యక్తిగత పతకాలు గెలుచుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరాటే మాస్టర్ స్రవంతి మాట్లాడుతూ.. మార్షల్ ఆర్ట్స్ సాధన విద్యార్థులలో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, శారీరక దారుఢ్యాన్ని పెంచుతుందని, విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. విజేతలను పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు. పోటీలను మాస్టర్ రవి నాయక్, మాస్టర్ ముకేష్ విజయవంతంగా నిర్వహించారు.

## అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు టిప్పర్ల పట్టివేత



**కృష్ణ, అక్టోబర్ 5 (జనంసాక్షి):** కృష్ణ పోలీస్ స్టేషన్ పరిధిలోని కున్సి సమీపంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు టిప్పర్లను టాస్క్ ఫోర్స్ పోలీసులు పట్టుకున్నట్లు ఎస్సై ఎస్.ఎం. నవీద్ తెలిపారు. టీఎస్ 08యూబీ 5587, కేఏ 32ఏబీ 5081 నంబర్లు గల వాహనాలను స్వాధీనం చేసుకుని, డ్రైవర్లు శ్రీరాములు, గురునాథ్‌లతో పాటు యజమానులు వెంకటేష్, శ్రీకాంత్ రాథోడ్‌లపై కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. మండలంలో అక్రమ ఇసుక రవాణా లేదా ఇతర చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

జనంసాక్షి
మెదక్ - మహబూబ్‌నగర్ జిల్లా
మంగళవారం
06 అక్టోబర్ 2026


# మెదక్‌లో 'శ్రీ వైభవ్ షాపింగ్ మాల్' ఘన ప్రారంభోత్సవం




మెదక్ టౌన్ అక్టోబర్ 5, (జనంసాక్షి): మెదక్ పట్టణంలో ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన 'శ్రీ వైభవ్ షాపింగ్ మాల్' ప్రారంభోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి 'జాతిరత్నాలు' సినిమా ఫేమ్, ప్రముఖ సినీ నటి ఫరియా అబ్దుల్లా ముఖ్య అతిథిగా హాజరై, మాల్‌ను ఘనంగా ప్రారంభించారు. ఆమెను చూసేందుకు అభిమానులు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో మాల్ ప్రాంగణంలో సందడి నెలకొంది.

ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ కానుగు రాధిక భూపతి రాజ్, వైస్ చైర్మన్ దొంతి నరేష్, పట్టణ కౌన్సిలర్లు మరియు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొని, యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు.

మెదక్ పట్టణ ప్రజల అవసరాలకు అనుగుణంగా నాణ్యమైన ఉత్పత్తులు, ఆధునిక సదుపాయాలు మరియు కుటుంబ సమేతంగా షాపింగ్ చేసుకునే వసతులను శ్రీ వైభవ్ షాపింగ్ మాల్‌లో అందుబాటులోకి తెచ్చారు. స్థానిక ప్రజలకు అత్యుత్తమ మరియు సరికొత్త షాపింగ్ అనుభూతిని అందించడమే తమ ముఖ్య లక్ష్యమని ఈ సందర్భంగా మాల్ నిర్వాహకులు వెల్లడించారు.

# జాతీయస్థాయి 'ప్రేరణ 2.0'కి గీతా స్కూల్ విద్యార్థిని మహతి ఎంపిక




తూప్రాన్, అక్టోబర్ 5 (జనంసాక్షి): భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ ప్రారంభించిన "ప్రేరణ 2.0" కార్యక్రమానికి తూప్రాన్ గీతా స్కూల్ 10వ తరగతి విద్యార్థిని బి. మహతి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ జి. అరుణ తెలిపారు. జిల్లా విద్యాశాఖ పర్యవేక్షణలో మెదక్ జిల్లా పరిషత్ పాఠశాలలో జరిగిన ఎంపిక పోటీల్లో మహతి అత్యుత్తమ ప్రతిభ కనబరిచింది.

నాయకత్వ లక్షణాలు, దేశ సంస్కృతి మరియు వారసత్వంపై అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా జరిగే ఈ కార్యక్రమంలో భాగంలో మహతి గుజరాత్‌లోని వద్నగర్‌లోని నివాస శిక్షణ శిబిరంలో పాల్గొననుంది. అక్కడ ప్రధాని మోదీ చదువుకున్న పాఠశాలతో పాటు ఐఐటీ గాంధీనగర్‌ను సందర్శించనుంది. ఈ సందర్భంగా పాఠశాల కరెస్పాండెంట్ పి. రామాంజనేయులు, చైర్‌పర్సన్ పి. ఉష, డైరెక్టర్లు మరియు ఉపాధ్యాయులు మహతిని అభినందించారు.

# 210 మంది చిన్నారులకు రెండే గదులా?

- పాఠశాల దుస్థితిపై కలెక్టర్‌కు బీజేపీ వినతి



వనపర్తి, అక్టోబర్ 5 (జనంసాక్షి): వనపర్తి పట్టణంలోని వల్లభ్‌నగర్ జెడ్పీ ప్రాథమిక పాఠశాలలో 210 మంది విద్యార్థులకు కేవలం రెండు తరగతి గదులే ఉండటంపై బీజేపీ పట్టణ శాఖ ఆందోళన వ్యక్తం చేసింది. కనీస మౌలిక వసతులు లేక విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను తీర్చాలని కోరుతూ బీజేపీ పట్టణ అధ్యక్షుడు బత్తిని మధు ఆధ్వర్యంలో నాయకులు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అదనపు తరగతి గదులు, భోజనశాల, రక్షణ గేటు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

ఈ సమస్యపై స్పందించిన కలెక్టర్ తగిన ప్రత్యేక చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా బత్తిని మధు మాట్లాడుతూ.. విద్యాశాఖ బాధ్యతలు చూస్తున్న ముఖ్యమంత్రి స్వయంగా చదివిన పట్టణంలోనే పాఠశాలల పరిస్థితి ఇలా ఉండటం బాధాకరమన్నారు. పేద పిల్లలకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బా. శెట్టి శ్రీను, విజయ్ సాగర్, మంగ, చిన్న రాయుడు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# కుంటలోపు తాండలో తీరని తాగునీటి కష్టాలు..

- అధికారుల చొరవ కోసం ఎదురుచూపులు!



బాలానగర్, అక్టోబర్ 5 (జనంసాక్షి): బాలానగర్ మండలంలోని గంగాధర్‌పల్లి గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న కుంటలోపు తాండలో గత రెండు నెలలుగా తాగునీటి సమస్య తీవ్రంగా వేధిస్తోందని తండావాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ పంచాయతీ పరిధిలోని బోరులో భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో నీటి లభ్యత తగ్గిపోయిందని వారు తెలిపారు.

ప్రస్తుతం తండాకు వారానికి మూడు సార్లు మాత్రమే వాటర్ ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారని తండావాసులు పేర్కొన్నారు. అయితే సరఫరా అవుతున్న నీరు తాగునీటి అవసరాలతో పాటు నిత్యావసరాలకు కూడా సరిపోవడం లేదని వాపోతున్నారు. దీంతో మహిళలు, చిన్నారులు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

రోజువారీ అవసరాలకు సరిపడా నీరు అందకపోవడంతో తండావాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వేసవి పరిస్థితులు మరింత తీవ్రతరం కాకముందే సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాల్సిన అవసరం ఉందని వారు కోరుతున్నారు. తండాలో నెలకొన్న తాగునీటి సమస్యను అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే దృష్టికి తీసుకుని ప్రత్యామ్నాయ నీటి వనరులు ఏర్పాటు చేయడంతో పాటు, క్రమం తప్పకుండా నీటి సరఫరా చేయాలని తండావాసులు విజ్ఞప్తి చేశారు.

# ఆర్టీఐ వారోత్సవాలను సమర్థవంతంగా నిర్వహించాలి

- అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సంగీత



సంగారెడ్డి, అక్టోబర్ 5 (జనంసాక్షి): సమాచార హక్కు చట్టం-2005పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు అక్టోబర్ 5 నుంచి 12వ తేదీ వరకు నిర్వహిస్తున్న సమాచార హక్కు చట్టం వారోత్సవాలను జిల్లాలో సమర్థవంతంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సంగీత అధికారులను ఆదేశించారు.

సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అధికారులతో ఆర్టీఐ వారోత్సవాల నిర్వహణపై ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సమాచార హక్కు చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, చట్టం ప్రకారం ప్రభుత్వ అధికారులు, సిబ్బంది నిర్వహించాల్సిన బాధ్యతలపై చైతన్యం కల్పించడం వారోత్సవాల ప్రధాన ఉద్దేశమన్నారు. జిల్లా, రెవెన్యూ డివిజన్, మండల స్థాయిల్లో సంబంధిత శాఖలు, ప్రజా సమాచార సంస్థల భాగస్వామ్యంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. సమాచార హక్కు చట్టంలోని సెక్షన్ 4(1)(బి) ప్రకారం ప్రభుత్వ శాఖలు స్వచ్ఛందంగా సమాచారాన్ని వెల్లడించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఈ నెల 9న రాష్ట్ర స్థాయిలో నిర్వహించే కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించేందుకు జిల్లా కేంద్రంలో అవసరమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. సహాయ ప్రజా సమాచార అధికారులు, ప్రజా సమాచార అధికారులు, తొలి అప్పీల్ అధికారులుగా ఉన్న అధికారులు తప్పనిసరిగా కార్యక్రమంలో పాల్గొనాలని ఆదేశించారు. వారోత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# లో ఓల్టేజ్ సమస్యలు లేకుండా చూడాలి

- హాంసన్నపల్లి సబ్ స్టేషన్ పరిశీలించి..
- టీజీఎస్‌పీడీసీఎల్ సీఎండీ జితేష్ పాటిల్



మెదక్, అక్టోబర్ 5 (జనంసాక్షి): విద్యుత్ వినియోగదారులకు లో ఓల్టేజ్ సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని టీజీఎస్‌పీడీసీఎల్ సీఎండీ జితేష్ పాటిల్ అధికారులను ఆదేశించారు. సోమవారం మెదక్ జిల్లాలో ఆకస్మిక తనిఖీలు చేపట్టిన ఆయన, 132/33 కేవీ కొడపల్లి సబ్‌స్టేషన్‌ను పరిశీలించి వోల్టేజీలు, లోడ్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు.

అనంతరం కొల్చారం, పాపన్నపేట మండలాల్లో వరి పొలాలను సందర్శించి పోచయ్య, రాములు, బైండ్ల అశోక్, సిద్ధిరాం రెడ్డి తదితర రైతులతో మాట్లాడి పంట సాగు వివరాలు అడిగి తెలుసుకున్నారు. వరికి బదులుగా కూరగాయలు, పండ్ల తోటలు, పూల సాగు వంటి ప్రత్యామ్నాయ పంటలు వేస్తే మెరుగైన ఆదాయం వస్తుందని రైతులకు వివరించారు. ఒక గుంట భూమిలో కొర్రమీను చేపల పెంపకం, మేకల పెంపకం వంటి అనుబంధ రంగాల ద్వారా వరి కంటే అధిక లాభాలు పొందవచ్చని సూచించగా, రైతులు ఈ సూచనలపై ఆసక్తి చూపి ప్రత్యామ్నాయ సాగు చేస్తామని తెలిపారు.

అక్కడి నుంచి అంసానపల్లి సబ్‌స్టేషన్‌ను పరిశీలించిన సీఎండీ, తరచూ అంతరాయాలకు గురవుతున్న 11 కేవీ ఫీడర్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా అంసానపల్లి సర్పంచ్ గీతా రమేష్ ప్రత్యేక 11 కేవీ లైన్ ఏర్పాటు చేయాలని సీఎండీకి వినతిపత్రం ఇచ్చారు. అనంతరం 220/132/33 కేవీ మీన్‌పూర్ ఈహెచ్‌టీ సబ్‌స్టేషన్‌లో ఇటీవల ఓఎల్‌టీసీ సమస్య తలెత్తిన 160 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ పరిస్థితిని ఏడీఈ, ట్రాన్స్‌కో అధికారులతో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఆపరేషన్స్ రూరల్ జోన్ సీఈ బాలస్వామి, మెదక్ ఎస్ఈ నారాయణ నాయక్, డీఈ రామేశ్వరస్వామి మరియు విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# అక్టోబర్ 15లోగా భూ రీసర్వే పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి
- రైతులకు ముందస్తు నోటీసులు..
- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై కలెక్టర్ సూచనలు




వనపర్తి బ్యూరో అక్టోబర్ 5 (జనంసాక్షి): భూ రీసర్వే పనులను అత్యంత పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేయాలని వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. సోమవారం పెద్దమందడి మండలం వీరాయపల్లి గ్రామంలో భూ రీసర్వేలో భాగంగా చేపడుతున్న గ్రామ హద్దుల గుర్తింపు పనులను ఆయన స్వయంగా పరిశీలించారు. రీసర్వే నిర్వహణపై రైతులకు ముందస్తుగా నోటీసులు అందజేయాలని, గ్రామపంచాయతీ కార్యాలయంలో సమగ్ర వివరాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. అక్టోబర్ 15వ తేదీ నాటికి గ్రామంలో రీసర్వే పనులన్నీ పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

**ఇంటింటి పరిశీలన - పింఛన్ దరఖాస్తు తనిఖీ...**

పర్యటనలో భాగంగా ఒంటరి మహిళా పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్న ప్రమీల ఇంటికి వెళ్లి, ఆమె దరఖాస్తు వివరాలను కలెక్టర్ నేరుగా పరిశీలించి ధ్రువీకరించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను పారదర్శకంగా చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

**ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై సూచనలు...**

గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించిన కలెక్టర్, లబ్ధిదారులు నిబంధనల ప్రకారం ఇళ్లను నిర్మించుకోవాలని సూచించారు. బేస్‌మెంట్లను అనవసరంగా ఎత్తుగా నిర్మించి అదనపు ఖర్చుల భారం పెంచుకోవద్దని హితవు పలికారు. అర్హులైన లబ్ధిదారులకు స్వయం సహాయక మహిళా సంఘాల ద్వారా రుణాలు అందేలా చర్యలు తీసుకోవాలని, గృహ నిర్మాణ బిల్లులు సకాలంలో మంజూరయ్యేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఖీమ్యా నాయక్, టి. వినోద్ కుమార్, జెడ్పీ సీఈవో యాదయ్య, ఇతర అధికారులు, గ్రామ సర్పంచ్ పాల్గొన్నారు.

# పథకాలు పొందాలంటే 'రైతు రిజిస్ట్రేషన్' తప్పనిసరి

- రైతులు లబ్ధి పొందేందుకు ప్రత్యేక డిజిటల్ ఐడి
- రైతు రిజిస్ట్రేషన్ చేసుకుంటేనే ఏడాదికి రూ:6000
- మండల వ్యవసాయ అధికారి అభినాష్ వర్మ






**న్యాల్‌కల్, అక్టోబర్ 05 (జనంసాక్షి):** కేంద్ర ప్రభుత్వం నుంచి అమలయ్యే వ్యవసాయ సంబంధిత రాయితీలు, పథకాల లబ్ధి పొందాలంటే రైతులు తప్పనిసరిగా "రైతు రిజిస్ట్రేషన్" చేసుకోవాలని న్యాల్‌కల్ మండల వ్యవసాయ అధికారి (ఏఓ) అభినాష్ వర్మ సూచించారు. జిల్లా వ్యవసాయ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

**ప్రత్యేక 'డిజిటల్ ఐడీ' కేటాయింపు...**

అర్హులైన ప్రతి రైతు భూమి వివరాలు, ఆధార్ కార్డ్, బ్యాంక్ ఖాతా, ఫోన్ నంబర్‌లను అనుసంధానించి ఒక ప్రత్యేక డిజిటల్ ఐడీని కేటాయిస్తారు.

**రిజిస్ట్రేషన్ ద్వారా కలిగే ప్రధాన ప్రయోజనాలు...**

**పీఎం కిసాన్ నిధులు:** ఏడాదికి అందే రూ. 6,000 ఆర్థికసాయం ఖాతాల్లో జమకావడానికి ఈ రిజిస్ట్రేషన్ తప్పనిసరి.

**రాయితీ ఎరువులు & విత్తనాలు:** మీసేవ/డీలర్ల వద్ద ఆధార్ వేలిముద్ర ద్వారా యూరియా, డీఏపీ, నాణ్యమైన విత్తనాలు సులభంగా పొందవచ్చు. దీనివల్ల నకిలీ విత్తనాలు, బ్లాక్ మార్కెటింగ్‌కు అడ్డుకట్ట పడుతుంది.

**పంట భీమా & పరికరాలు:** పీఎం ఫసల్ భీమా యోజన నష్టపరిహారం పొందడానికి, అలాగే 'యంత్ర లక్ష్మి' కింద ట్రాక్టర్లు, రోటవేటర్లు, డ్రిప్ పరికరాల రాయితీల సాధనకు ఇది కీలకం.

**సులభంగా ధాన్యం విక్రయాలు:** ప్రతి సీజన్‌లో పదేపదే జిరాక్స్ పత్రాలు ఇచ్చే పనిలేకుండా మద్దతు ధరకు నేరుగా పంటలను విక్రయించుకోవచ్చు.

మండల రైతులు వెంటనే సమీపంలోని మీసేవ కేంద్రాలు, వ్యవసాయ విస్తరణ అధికారులు (AEO) లేదా రైతు వేదికల ద్వారా ఈ రిజిస్ట్రేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని ఏఓ కోరారు.

## బీసీ వసతి గృహాన్ని తనిఖీ చేసిన తహసీల్దార్ బీ.అశోక్



**కొండాపూర్, అక్టోబర్ 5 (జనంసాక్షి):** కొండాపూర్ మండలం తోగర్‌పల్లిలోని బీసీ బాలుర వసతి గృహాన్ని మండల తహసీల్దార్ బి.అశోక్ సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల విద్యాప్రగతిని అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం జరుగుతున్న SA-1 పరీక్షలను దృష్టిలో ఉంచుకుని విద్యార్థులు చదువుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ముఖ్యంగా 10వ తరగతి విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివి మంచి ఫలితాలు సాధించాలని, క్రమశిక్షణతో లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. తనిఖీ సమయంలో వసతి గృహ సంక్షేమ అధికారి విధుల్లో ఉన్నారు.

## కోహీర్‌లో ప్రజావాణి - రెండు ఫిర్యాదుల స్వీకరణ



**కోహీర్, అక్టోబర్ 5 (జనంసాక్షి):** సంగారెడ్డి జిల్లా కోహీర్ ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో ఎం. ఉమాదేవి ఆధ్వర్యంలో సోమవారం మండలస్థాయి ప్రజావాణి కార్యక్రమం జరిగింది. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని త్వరితగతిన పరిష్కరించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని అధికారులు వెల్లడించారు.

ఈ ప్రజావాణికి మండల స్థాయిలోని వివిధ శాఖలకు చెందిన 19 మంది అధికారులు హాజరయ్యారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అధికారులు మొత్తం రెండు ఫిర్యాదులను స్వీకరించి నమోదు చేశారు. ఈ అర్జీలను సంబంధిత శాఖల అధికారులకు పంపించి, క్షేత్రస్థాయి విచారణ జరిపి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహించకుండా సమన్వయంతో పని చేయాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, భూ సమస్యలు, స్థానిక సమస్యలపై ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### నిరుద్యోగ యువతకు
## 45 రోజుల ఉచిత ఎస్సై, కానిస్టేబుల్ శిక్షణ

- ఎస్.ఐ సోమేశ్వరి




**కొండాపూర్, అక్టోబర్ 5 (జనంసాక్షి):** సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ పరతోష్ పంకజ్, ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఎస్సై, కానిస్టేబుల్ ఉద్యోగాల పోటీ పరీక్షలకు 45 రోజుల పాటు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు మండల ఎస్సై సోమేశ్వరి, తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ఎస్సై, కానిస్టేబుల్ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువత ఈ ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు. పోటీ పరీక్షలకు సమర్థవంతంగా సిద్ధమయ్యేందుకు ఈ శిక్షణ ఉపయోగపడుతుందని తెలిపారు. దరఖాస్తు చేసుకునేందుకు 07-10-2026 సాయంత్రం వరకు గడువు ఉందని, ఆసక్తి ఉన్న అభ్యర్థులందరూ నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. కొండాపూర్ మండలంలోని అన్ని గ్రామాల అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

### విజృంభణంగా మాజీ
## ఎంపీపీ శ్రీకాంత్ రెడ్డి జన్మదిన వేడుకలు



**నంగునూరు అక్టోబర్ 5 (జనంసాక్షి):** మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని నంగునూరు మండల బిఆర్ఎస్ నాయకులు, సర్పంచుల ఆధ్వర్యంలో కోనాయిపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మైసంపల్లి గ్రామంలో సర్పంచ్ నరేష్ రెడ్డి ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పూజలు జరిపి, శ్రీకాంత్ రెడ్డి ఆయురారోగ్యాలు ప్రసాదించాలని వేడుకున్నారు. అనంతరం స్థానిక ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పండ్లు పంపిణీ చేసి, వారితో కలిసి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.

### నేడు గుమ్మడిదల
## మున్సిపల్ సర్వసభ్య సమావేశం



**గుమ్మడిదల, అక్టోబర్ 5 (జనంసాక్షి):** గుమ్మడిదల మున్సిపాలిటీ సర్వసభ్య సమావేశం మంగళవారం ఉదయం 10:30 గంటలకు స్థానిక MPDO కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ చిన్నపాపాని కుమార్ గౌడ్ అధ్యక్షతన జరగనుంది. ఈ సమావేశంలో మున్సిపాలిటీ పరిధిలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులు, మౌలిక వసతులు, పరిపాలనా అంశాలపై చర్చించనున్నారు. కౌన్సిలర్లు, అధికారులు, సంబంధిత సిబ్బంది అందరూ సకాలంలో హాజరుకావాలని అధికారులు కోరారు. ఈ సమావేశంలో తీసుకోబోయే నిర్ణయాలపై పట్టణ ప్రజల్లో తీవ్ర ఆసక్తి నెలకొంది.

## ఖానాపూర్‌లో 'పోషణ మాసం' వేడుకలు

**నంగునూరుం, అక్టోబర్ 5(జనంసాక్షి):** నంగునూరు మండలం ఖానాపూర్‌లో సర్పంచ్ బాల్దా మల్లేశం అధ్యక్షతన, సీడీపీఓ హరిత ఆధ్వర్యంలో పోషణ మాసం కార్యక్రమం జరిగింది. తల్లులకు పోషకాహారం, బాలామృతం వంటకాలపై అవగాహన కల్పించడంతో పాటు గర్భిణులకు శ్రీమంతాలు జరిపి ప్రతిజ్ఞ చేయించారు. ఈ వేడుకలో సూపర్‌వైజర్ రమాదేవి, అంగన్‌వాడీ టీచర్ రేణుక, ఆశా కార్యకర్తలు మరియు గ్రామీణులు పాల్గొన్నారు.

### అప్రకటిత కరెంట్
## కోతలతో పంటలు ఎండుముఖం



**హత్నూర, సెప్టెంబర్ 5 (జనంసాక్షి):** అసలే ఎల్ నినో ప్రభావంతో ముఖం చాటేసిన వానలు, దానికి తోడు అప్రకటిత కరెంట్ కోతలు రైతన్నలపై తీవ్ర ప్రభావం చూపుతుంది. పంటలు పొట్ట దశకు వచ్చిన వేళ కరెంట్ కోతలు తీవ్ర రూపం దాల్చడంతో రైతులు గుండెలు బాదుకుంటున్నారు. ఎన్నో వ్యయప్రయాసల కోర్చి సాగు చేసిన పంటలు తమ కళ్ళముందే ఎండుముఖం పడుతూ ఉండటాన్ని చూసి రైతులు లబోదిబోమంటున్నారు. అప్రకటితా విద్యుత్ సరఫరాను నిరసిస్తూ రైతులు సోమవారం నస్తీపూర్ విద్యుత్ ఉపకేంద్రం ముందు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. రైతులకు సాగునీరు అందించే విద్యుత్ మోటార్లకు సరిపడా నిరంతరాయంగా విద్యుత్ ను సరఫరా చేయాలని వారు డిమాండ్ చేశారు.

### మైనర్ డ్రైవింగ్...
## వాహన యజమాని, డ్రైవర్‌పై కేసు నమోదు

- కొల్చారం ఎస్ఐ మహమ్మద్ మోహీనుద్దీన్



**కొల్చారం, అక్టోబర్ 05 (జనంసాక్షి):** ఏడుపాయల టీ జంక్షన్ వద్ద ఇన్నోవా కారును మహేంద్ర థార్ వాహనం ఢీకొట్టిన ఘటనలో మైనర్ డ్రైవర్‌తో పాటు వాహన యజమానిపై కేసు నమోదు చేసినట్లు కొల్చారం ఎస్సై మహమ్మద్ మొయినుద్దీన్ తెలిపారు. ప్రమాదంలో ప్రయాణికులకు గాయాలు కానప్పటికీ, రెండు వాహనాలు దెబ్బతిన్నాయి. దర్యాప్తులో థార్ నడిపింది మైనర్‌గా తేలడంతో ఈ చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. మైనర్లకు వాహనాలు ఇవ్వకుండా తల్లిదండ్రులు, యజమానులు బాధ్యతగా ఉండాలని ఎస్సై హెచ్చరించారు.

### యువతే దేశ
## భవిష్యత్తు.. రాజకీయాల్లోకి రావాలి

- ఏఎంసి వైస్ చైర్మన్ సాదుల పవన్ కుమార్



**నంగునూరు, అక్టోబర్ 5(జనంసాక్షి):** దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, యువత క్రియాశీల రాజకీయాల్లోకి రావాలని సిద్దిపేట జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సాదుల పవన్ కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం నంగునూరు మండల కేంద్రంలో ఆయన ఆధ్వర్యంలో యువజన కాంగ్రెస్ మండల రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సాదుల పవన్ కుమార్ మాట్లాడుతూ.. గ్రామ, మండల స్థాయిలో యువజన కాంగ్రెస్‌ను బలోపేతం చేసి, క్షేత్రస్థాయిలో బలమైన నాయకత్వాన్ని తయారు చేయాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాశిద్, అజ్మత్, ఆతిఫ్, మంగళారపు వెంకటేష్, సిరం బాను, సాయికుమార్, మహేష్, అఖిల్, నవీన్, రాజు, విగ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

## భార్య పుట్టింటికి వెళ్లిందని మనస్తాపం

- పురుగుల మందు తాగి వ్యక్తి మృతి



**నర్సాపూర్, సెప్టెంబర్ 5 (జనంసాక్షి):** భార్య పుట్టింటికి వెళ్లడంతో మనస్తాపానికి గురై పురుగుల మందు తాగిన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. నర్సాపూర్ మండలం బ్రాహ్మణపల్లి గుర్జ తండాకు చెందిన వంకదోత్ గోపాల్ (32) మద్యానికి బానిసై కుటుంబంతో గొడవపడేవాడు. భార్య పుట్టింటికి వెళ్లడంతో మనస్తాపం చెందిన అతడు, ఈ నెల 3న పొలంలో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు గాంధీ ఆసుపత్రికి తరలించగా, సోమవారం చికిత్స పొందుతూ మరణించాడు. ఎస్సై రంజిత్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# రోడ్డుపై వెలిసిన డబ్బాలను తొలగించాలి



**హత్నూర, సెప్టెంబర్ 5 (జనంసాక్షి):** మండలం పరిధిలోని కాసాల గ్రామం 12వ వార్డులో ప్రధాన రహదారిపై వేసుకున్న డబ్బాలను తొలగించాలని కోరుతూ కాసాల గ్రామస్తులు సోమవారం సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్లో నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. రోడ్డును ఆనుకుని ఉన్న స్థలంలో కొందరు వ్యాపారస్తులు అక్రమంగా డబ్బాలను ఏర్పాటు చేసి వాహనదారులకు ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కొంతమంది వ్యక్తులు అక్రమంగా డబ్బాలను ఏర్పాటు చేసి వాటిని ఇతరులకు అద్దె ఇవ్వడంతో పాటు నెలసరి అద్దెకు ఇచ్చి అడ్డదారిలో డబ్బులు సంపాదిస్తున్నారని వారు ఆరోపించారు. గ్రామ పంచాయతీకి సమకూరాల్సిన నిధులను కొంతమంది వ్యక్తులు అడ్డదారిలో నిధులను పక్కదోవ పట్టిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అక్రమార్కులపై చర్యలు తీసుకుని గ్రామ పంచాయతీకి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు.

# వివోఏలను వేధించడం సరైనది కాదు



**హత్నూర, సెప్టెంబర్ 5 (జనంసాక్షి):** నిష్పక్షపాతంగా మహిళా సంఘాలకు సేవలందిస్తున్న వివోఏలను వేధించడం సరైనది కాదని ఆ సంఘం యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నగేష్ స్పష్టం చేశారు. వివోఏలపై చేస్తున్న అవినీతి ఆరోపణలను నిరసిస్తూ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం హత్నూర మండల సమాఖ్య కార్యాలయం ముందు ఆందోళన నిర్వహించి ఎపిఎం కు వినతి పత్రం అందజేశారు.ఎలాంటి అవినీతికి పాల్పడకుండా మహిళా సంఘాలకు సేవలందిస్తున్న కాసాల వివోఏపై అసత్య ఆరోపణలు చేయడం సరైంది కాదన్నారు.ఎన్నో యేళ్ళుగా చాలీచాలనీ వేతనాలతో మహిళలకు సేవలందిస్తున్న వివోఏలపై లేనిపోని ఆరోపణలు చేస్తూ వారిని కించపరిచేలా వ్యవహరించడాన్ని వారు తప్పుబట్టారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా కార్యదర్శి సాయిలు, సిఐటియు మండల నాయకులు షబ్బీర్ అలీ, శేఖర్ ఆంజనేయులు కిష్టయ్య కృష్ణ నరెందర్ గౌడ్,భాగ్యలక్ష్మి.మల్లయ్య ప్రవీణ్ మల్లారెడ్డి, విజయ ధనలక్ష్మి పాల్గొన్నారు.

## ధన్వాడ పోలీస్ స్టేషన్ నూతన ఎస్సైగా ఎస్. కృష్ణంరాజు



**ధన్వాడ, అక్టోబర్ 5 (జనంసాక్షి):** ధన్వాడ పోలీస్ స్టేషన్ నూతన ఎస్‌హెచ్‌ఓగా ఎస్సై ఎస్. కృష్ణంరాజు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో మహబూబ్‌నగర్ జిల్లా మహిళా పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించిన ఆయన బదిలీపై ధన్వాడకు వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం జిల్లా ఎస్పీ డాక్టర్ జి. వినీత్, ఐపీఎస్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్క అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ నూతన ఎస్సైకి శుభాకాంక్షలు తెలిపి, ప్రజలకు అందుబాటులో ఉంటూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని, మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఎస్సై కృష్ణంరాజు మాట్లాడుతూ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలను చట్టపరంగా పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. నేరాల నియంత్రణ, చట్టవ్యతిరేక కార్యకలాపాల అరికట్టడం, మహిళలు, ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు.

## రైతులను ఆదుకోండి.. జూరాల నీటిని విడుదల చేయండి - చిట్టెం రామ్మోహన్ రెడ్డి



**ఆత్మకూర్, అక్టోబర్ 5 (జనంసాక్షి):** జూరాల ఆయకట్టు రైతులను ఆదుకోవాలని, నాలుగు రోజుల పాటు నీళ్లు వదిలి నాలుగు రోజులు బంద్ పెట్టే విధంగా నిర్ణయం తీసుకోవాలని మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.సోమవారం ఆత్మకూరులో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జిల్లా స్థాయిలో సమావేశాలు పెట్టి అధికారులు, రైతులకు అవగాహన కల్పించామని గుర్తు చేశారు. తాగునీరు సరిగ్గా అందక పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు.ప్రభుత్వం ప్రకటించిన 5 టీఎంసీల నీరు ఎక్కడ ఉందని ప్రశ్నించారు. చెరువుల్లో నీళ్లు నింపకపోవడంతో అవి ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు.భీమా ఫేజ్-2 కాల్వకు నీటిని నిలిపివేయాలని, వర్షాకాలంలో వారం బంద్ ఏమిటని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకుని రైతులకు మేలు చేసే చర్యలు తీసుకోవాలని సూచించారు. నిర్ణయాన్ని మార్చుకుంటే రైతులకు తమ మద్దతు ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు రవి కమార్ యాదవ్ ,ఎంపీపీ బంగారు శ్రీనివాస్, మాజీ వైస్ ఎంపీపీ కోటేష్, నాయకులు లక్ష్మీకాంత్ రెడ్డి, వీరశలింగం, అంజి, మండ్ల రామకృష్ణ, ఎండి రియాజ్, ఎండి షరీఫ్ తో పాటు వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

# కరెంటు సమస్యలపై సర్పంచుల ఫైర్





**కొల్చారం, అక్టోబర్ 05 (జనంసాక్షి):** మండల కేంద్రమైన కొల్చారంలో ఎంపీడీవో రఫీక్ ఉన్నిసా ఆధ్వర్యంలో సోమవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మండలంలోని వివిధ శాఖల అధికారులు, సర్పంచులు హాజరయ్యారు. శాఖల వారీగా చేపట్టిన అభివృద్ధి పనులు, సాధించిన ప్రగతిపై అధికారులు నివేదికలను చదివి వినిపించారు.

ఈ సందర్భంగా పలువురు సర్పంచులు గ్రామాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా లోవోల్టేజ్ సమస్యను పరిష్కరించాలని కోరారు. బతుకమ్మ, దసరా పండుగలు సమీపిస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసే పనులకు విద్యుత్ లైన్మెన్లు పంచాయతీ పాలకవర్గాలకు సహకరించాలని సర్పంచుల ఫోరం అధ్యక్షులు పైతర గ్రామ సర్పంచ్ యాబన్న గారి రవితేజ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

దీనిపై విద్యుత్ శాఖ సబ్ఇంజనీర్ సానుకూలంగా స్పందిస్తూ క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి, లోవోల్టేజ్ సమస్య ఉన్న ప్రాంతాలను గుర్తిస్తామని తెలిపారు. ఆయా ప్రాంతాల్లో విద్యుత్ ఉపకేంద్రాల వద్ద ట్యాబ్ పెంచే చర్యలు చేపట్టేందుకు ప్రయత్నిస్తామని పేర్కొన్నారు.

తహసీల్దార్ శ్రీనివాస్ చారి మాట్లాడుతూ ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి ప్రజల నుంచి ఆశించిన స్థాయిలో దరఖాస్తులు రావడం లేదన్నారు. మండలంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు.

ఈ సమావేశంలో ఎంపీవో సంతోష్, తహసీల్దార్ శ్రీనివాస్ చారి, డిప్యూటీ తహసిల్దార్ నాగవర్ధన్ ,వివిధ శాఖల అధికారులు, సర్పంచులు పాల్గొన్నారు.

# నీట్‌లో ప్రతిభ.. మనోజ్ఞశ్రీకి ఎంబీబీఎస్ సీటు

- **జనగామ ప్రభుత్వ మెడికల్ కాలేజీలో సీటు**
- **డాక్టర్ కావాలన్న లక్ష్యంతో కష్టపడి చదివిన విద్యార్థిని**



**చిన్నశంకరంపేట, అక్టోబర్ 5 (జనంసాక్షి):** చిన్నశంకరంపేట మండల కేంద్రానికి చెందిన కుమ్మరి శ్రీనివాస్, స్వప్న దంపతుల కుమార్తె కుమ్మరి మనోజ్ఞశ్రీ వైద్య విద్యలో సీటు సాధించి తన ప్రతిభను చాటుకుంది. ఇటీవల నిర్వహించిన నీట్ పరీక్షలో మంచి ర్యాంకు సాధించిన ఆమెకు జనగామ ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీటు లభించింది.

చిన్ననాటి నుంచే వైద్యురాలిగా ఎదగాలనే లక్ష్యాన్ని పెట్టుకున్న మనోజ్ఞశ్రీ అందుకు అనుగుణంగా చదువుపై ప్రత్యేక శ్రద్ధ కనబరిచింది. నీట్ పరీక్షలో ర్యాంకు సాధించేందుకు నిరంతరం కష్టపడి చదివింది. ఆమె పట్టుదలకు ఫలితంగా ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీటు దక్కింది.

వైద్య విద్యలో సీటు సాధించేందుకు విద్యార్థులు తీవ్రంగా పోటీ పడుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో మనోజ్ఞశ్రీ ప్రభుత్వ వైద్య కళాశాలలో సీటు పొందడం కుటుంబ సభ్యుల్లో ఆనందాన్ని నింపింది. ప్రైవేటు వైద్య కళాశాలల్లో అధిక ఖర్చుతో కూడుకున్న వైద్య విద్యను అభ్యసించాల్సిన పరిస్థితుల్లో ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా చదువుపై దృష్టి పెట్టి ప్రభుత్వ కళాశాలలో సీటు సాధించడం తమ కుమార్తె కష్టానికి దక్కిన ఫలితమని కుటుంబ సభ్యులు తెలిపారు.

తమ కుమార్తె చిన్ననాటి కలను సాకారం చేసుకునే దిశగా తొలి అడుగు వేసిందని శ్రీనివాస్, స్వప్న దంపతులు ఆనందం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో మంచి వైద్యురాలిగా ఎదిగి ప్రజలకు సేవ చేయాలన్నదే తమ కుమార్తె లక్ష్యమని తెలిపారు. మనోజ్ఞశ్రీ సాధించిన విజయంపై కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

## వెన్నచెడ్ వాసికి ఉత్తమ ఫిజికల్ డైరెక్టర్ అవార్డు



**గండీడ్, అక్టోబర్ 5 (జనంసాక్షి):** వెన్నచెడ్ గ్రామానికి చెందిన దోమ వెంకట్ పూడూరు మండల ఉత్తమ ఫిజికల్ డైరెక్టరగా ఎంపికయ్యారు. తెలంగాణ మోడల్ స్కూల్లో వ్యాయామ ఉపాధ్యాయుడిగా ఆయన సేవలందిస్తున్నరు. ఆయన ఆధ్వర్యంలో విద్యార్థులు, జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయి, జాతీయ స్థాయిలో క్రీడాప్రతిభ కొనియాడారు. విద్యార్థులను క్రీడల్లో ఉన్నత స్థాయికి తీసుకెళ్లడమే నాలక్షణంఅని వెంకట్ తెలిపారు.

## 9వ తరగతి ఎస్ఏ-1 జవాబు పత్రాల మూల్యాంకనం ప్రారంభం



**మల్దకల్, అక్టోబర్ 5 (జనంసాక్షి):** మల్దకల్ మండల కేంద్రంలో 9వ తరగతి సమ్మేటివ్ అసెస్మెంట్-1 జవాబు పత్రాల మూల్యాంకనం మండల విద్యాధికారి జి. సురేష్ ఆధ్వర్యంలో సోమవారం ప్రారంభమైంది.

మొదటి రోజు గణితం, భౌతిక శాస్త్రం జవాబు పత్రాలను ఉపాధ్యాయులు మూల్యాంకనం చేశారు. పారదర్శకతతో మూల్యాంకనం చేపట్టి, విద్యార్థుల అభ్యసన లోపాల ఆధారంగా పునశ్చరణ బోధన (రిమీడియల్ టీచింగ్) అందించాలని ఎంఈఓ సురేష్ ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో సంబంధిత ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజావాణికి 5 దరఖాస్తులు




**కృష్ణ, అక్టోబర్ 5 (జనంసాక్షి):** కృష్ణ మండలంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 5 దరఖాస్తులు వచ్చాయి.5 దర్ఖాస్తులు రెవిన్యూ డిపార్టుమెంటుకు చెందినవే, ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి కిషోర్ కుమార్,తహసీల్దార్ శ్రీనివాసులు, ఎం ఈ ఓ నిజమోద్దిన్, ఏఓ సుధర్సన్ గౌడ్, ఆర్డబ్ల్యు, ఏఈ సులోచన, తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి రూ.10 వేల ఆర్థికసాయం



**బాలానగర్, అక్టోబర్ 5 (జనంసాక్షి):** బాలానగర్ మండలంలోని తిరుమలగిరి గ్రామానికి చెందిన బాల్య నాయక్ (72) అనారోగ్యంతో మృతి చెందడంతో, ఆయన కుటుంబాన్ని జర్పుల భాస్కర్ నాయక్ పరామర్శించి అండగా నిలిచారు. బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పి, రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఆపదలో ఉన్న కుటుంబాలను ఆదుకోవడంలో భాస్కర్ నాయక్ ఎప్పుడూ ముందుంటారని గ్రామస్తులు కొనియాడారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజు నాయక్, యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# 10న సిద్దిపేటలో కవిగాయక సమ్మేళనం: నిర్వహణ కమిటీ పిలుపు

**సిద్దిపేట బ్యూరో, అక్టోబర్ 05 (జనంసాక్షి):** సిద్దిపేట జిల్లా ఆవిర్భవించి పదేళ్లు పూర్తయిన సందర్భంగా అక్టోబర్ 9, 10, 11 తేదీల్లో నిర్వహించనున్న 'దశాబ్ది ఉత్సవాల'లో భాగంగా ఈ నెల 10న విపంచి కళానిలయంలో రోజంతా కవిగాయక సమ్మేళనం జరగనుంది. ఈ మేరకు దశాబ్ది ఉత్సవ కవిగాయక నిర్వహణ కమిటీ సభ్యులు పోచబోయిన శ్రీహరి, కె.భీమసేన, లక్కరసు ప్రభాకర్ వర్మ, కలకుంట్ల రంగాచార్య, ఐతా చంద్రయ్య, సిద్దెంకి యాదగిరి తదితరులు సిద్దిపేట ప్రెస్ క్లబ్‌లో మీడియా సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు.

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సుదీర్ఘ పోరాటాల ఫలితంగా తెలంగాణ రాష్ట్రంతో పాటు సిద్దిపేట జిల్లా కల సాకారమైందని నేతలు గుర్తుచేసుకున్నారు. అక్టోబర్ 11, 2016న ప్రారంభమైన సిద్దిపేట జిల్లా, మాజీ మంత్రి హరీష్ రావు నేతృత్వంలో విద్య, వైద్యం, వ్యవసాయం వంటి అన్ని రంగాల్లో ఊహించని అభివృద్ధి సాధించిందన్నారు. ముఖ్యంగా కాళేశ్వరం ప్రాజెక్టులోని రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్, అన్నపూర్ణ సాగర్ రిజర్వాయర్ల ద్వారా గోదావరి జలాలు అందించి లక్షలాది ఎకరాలకు సాగునీరు అందించడం జరిగిందని తెలిపారు.

ఈ ప్రగతిని పురస్కరించుకుని ఈ నెల 10న ఉదయం 9:30 గంటల నుండి విపంచి ఆడిటోరియంలో నిర్వహించే కవిగాయక సమ్మేళనానికి జిల్లాలోని కవులు, కళాకారులు పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు.

**కవి సమ్మేళనం నిబంధనలు & వివరాలు:**

**పాల్గొనే ప్రాంతాలు:** సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక, హుస్నాబాద్, చేర్యాల, బెజ్జంకి ప్రాంతాలకు చెందిన కవులు, కళాకారులు పాల్గొనవచ్చు.

**అంశం:** "సిద్దిపేట జిల్లా ఏర్పడక ముందు.. ఏర్పడిన



తరువాత" అనే అంశం ఆధారంగా కవితలు/పద్యాలు ఉండాలి.

**పరిమితి:** కవితలు 25 లైన్లకు మించకూడదు.

**సత్కారం:** కార్యక్రమంలో పాల్గొన్న కవులు, కళాకారులకు ప్రత్యేక సత్కారం ఉంటుంది.

ఈ కార్యక్రమంలో మంజీరా రచయితల సంఘం, సిద్దిపేట జిల్లా రచయితల సంఘం, తెలంగాణ రచయితల సంఘం, ఉద్యమ కళాకారుల సంఘం మరియు నిరుద్యోగ కళాకారుల క్షేమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

## గురుకులలో ముందస్తుగా బతుకమ్మ సంబరాలు



**చేర్యాల, అక్టోబర్ 05(జనంసాక్షి):** మండల కేంద్రంలోని పీ.ఎం.శ్రీ తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో సోమవారం ముందస్తుగా బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తీరొక్క రంగు రంగుల పువ్వులతో బతుకమ్మలను పేర్చి తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలను ఉట్టిపడే విదంగా ఆట పాటలు, నృత్యాలు, కోలాటాలతో ఆటలాడుతూ పాటలు పాడుతూ అంగరంగ వైభవంగా బతుకమ్మ సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పోలోజు నర్సింహా చారి, మహిళా అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## 161 జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం..





**నారాయణఖేడ్, అక్టోబర్ 5 (జనంసాక్షి):** సంగారెడ్డి జిల్లా పరిధిలోని 161 జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. సంగారెడ్డి నుంచి నారాయణ ఖేడ్ వైపు వస్తున్న కారు, మరోవైపు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టినట్లు సమాచారం. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న సూర్ణ భాను (25) తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదం అనంతరం భానును అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

మృతుడు సూర్ణ బీరప్ప, నాగవ్వ దంపతుల కుమారుడు. భానుకు ఆరు నెలల క్రితమే జ్యోతితో వివాహం జరిగినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. దీంతో కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ప్రమాదానికి గురైన ద్విచక్ర వాహనం TS 08 S 8875 నంబర్ గల హోండా షైన్ గుర్తించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.

## కెప్టెన్ స్మిత్ ఆరోగ్యం కాంక్షిస్తూ ప్రత్యేక పూజలు



**పెద్ద శంకరంపట, అక్టోబర్ 5 (జనంసాక్షి):** దుబాయ్ విమాన ప్రమాదకర పరిస్థితిలో కో-పైలట్ దాడి చేసినా, ప్రాణాలను పణంగా పెట్టి 174 మంది ప్రయాణికులను కాపాడి గాయపడిన భారత సంతతి పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చుర్ త్వరగా కోలుకోవాలని పెద్దశంకరంపేట శివాలయంలో సామూహిక మహా మృత్యుంజయ జపాలు చేశారు. మండల బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఈ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్చక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు గుడి చంద్రశేఖర్, బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు ఆర్. కృష్ణశర్మ, నాగరాజు శర్మ, రాజేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## నాగల్ కడుమూరులో రూ.12 లక్షలతో హైస్కూల్ భవనాలు ప్రారంభం



**అమరచింత, అక్టోబర్ 5 (జనంసాక్షి):** అమరచింత మండలం నాగల్ కడుమూరు జడ్పీహెచ్ఎస్‌లో రూ.12 లక్షలతో నిర్మించిన నూతన భవనాలను మండల అధ్యక్షుడు రాజేందర్ రెడ్డి ప్రారంభించారు. రాష్ట్ర మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి ఆదేశాలు, టీజీ టాడీ టాపర్స్ ఫైనాన్స్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ కేశం నాగరాజు గౌడ్ సూచనలతో ఈ కార్యక్రమం జరిగింది. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు అవసరమైన మౌలిక వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో రమేష్, జింక రవి యాదవ్, ఉపాధ్యాయులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## దశకోటి పార్థివలింగార్చనకు సన్నాహాలు

**చిలప్‌చేడ్, చిట్కుల్, బండపోతుగల్‌లో నేడు పార్థివలింగాల తయారీ కార్యక్రమం**



**చిలప్‌చేడ్, అక్టోబరు 5 (జనంసాక్షి):** సంగారెడ్డి జిల్లా పసల్వాది జ్యోతిర్వాస్తు విద్యాపీఠంలో మార్చి 6, 2027న మహాశివరాత్రి సందర్భంగా జరగనున్న దశకోటి పార్థివలింగార్చన మహోత్సవానికి సన్నాహాలు శరవేగంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా చిలప్‌చేడ్, చిట్కుల్, బండపోతుగల్ గ్రామాల్లో పార్థివలింగాల తయారీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

ఈ కార్యక్రమంలో జ్యోతిర్వాస్తు విద్యాపీఠం వ్యవస్థాపకులు మహేశ్వర శర్మ సిద్ధాంతి స్వామి పాల్గొననున్నారు. పార్థివలింగాల తయారీలో మహిళా భక్తులు, గురుభక్తులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు. శివభక్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొని ఈ మహోత్సవానికి తమ వంతు సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

## మాజీ పంచాయతీ కార్మికురాలి కుటుంబానికి సర్పంచ్ అండ



**సిర్గాపూర్, అక్టోబర్ 5 (జనంసాక్షి):** సిర్గాపూర్ మండల కేంద్రానికి చెందిన గతంలో గ్రామ పంచాయతీ కార్మికురాలిగా పనిచేసిన మేత్రి మల్కమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ శ్రీనివాసరావు మల్కమ్మ కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బిక్షపతి, పంచాయతీ కార్యదర్శి నరసింహ గౌడ్, గ్రామ పెద్దలు శ్రీనివాస్ రావు, కృష్ణ, నర్సాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## దొంగతనం కేసు ఛేదన

- **నిందితుడి అరెస్ట్, బంగారం స్వాధీనం**




**నవాబ్‌పేట, అక్టోబర్ 05 (జనంసాక్షి):** కూచూరు గ్రామంలో జరిగిన దొంగతనం కేసును నవాబ్‌పేట పోలీసులు ఛేదించి, నిందితుడు పరమటి కుమార్‌ను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ నరేందర్ తెలిపారు. వాహన తనిఖీల్లో పట్టుబడిన నిందితుడి నుంచి ముక్కుపుడకతో పాటు మహబూబ్‌నగర్ మనప్పురంలో తాకట్టు పెట్టిన చెవి కమ్మలు, మాట్లీలను రికవరీ చేశారు. నిందితుడిని కోర్టులో హాజరుపరిచారు. కేసును త్వరగా ఛేదించిన హెడ్ కానిస్టేబుల్ సురేష్, కానిస్టేబుళ్లు వెంకట్రాములు, రాజు, ఖాజా, లోకేష్‌లను ఎస్ఐ ప్రత్యేకంగా అభినందించారు.

## అనారోగ్యంతో బాధపడుతూ వ్యక్తి ఆత్మహత్య



**బెజ్జంకి,అక్టోబర్ 5 (జనంసాక్షి):**మండల కేంద్రంలోని బెజ్జంకి గ్రామంలో సోమవారం ఓ వ్యక్తి ఉరివేసుకొని మృతి చెందిన హృదయ విదారక ఘటన చోటుచేసుకుంది.పోలీసుల వివరాల ప్రకారం గ్రామానికి చెందిన మల్లమారి రామ్‌చంద్రం (48) ట్రాలీ ఆటో యజమాని,డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు.రామ్‌చంద్రం గత నాలుగైదేళ్లుగా కిడ్నీలో రాళ్లు,థైరాయిడ్,గ్యాస్ సమస్యలతో బాధపడుతున్నట్లు,గత 15 రోజులుగా టైఫాయిడ్ జ్వరంతో ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు.అనారోగ్యం కారణంగా చికిత్సకు ఆర్థిక ఇబ్బందులు ఎదురవడంతో పాటు ఆటో నడపలేని పరిస్థితితో మానసికంగా బాధపడుతున్నట్లు పేర్కొన్నారు.ఈ క్రమంలో సోమవారం మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో ఇంట్లోని మెట్ల సలాకలకు నైలాన్ తాడుతో ఉరివేసుకొని మృతి చెందాడు.విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు.మృతుడికి ఒక కుమారుడు,ఒక కుమార్తె ఉన్నారు.మృతుని భార్య భూలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

## గుర్తుతెలియని వాహనం ఢీకొని మహిళ దుర్మరణం



**వెల్దండ, అక్టోబర్ 05 (జనంసాక్షి):** వెల్దండ మండల పరిధిలోని హైదరాబాద్ శ్రీశైలం జాతీయ రహదారిపై వెల్దండ మండల కేంద్రం సమీపంలోని మహబూబ్ స్వామి దర్గా వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ఆమనగల్ మండల పరిధిలోని చింతల పల్లి గ్రామానికి అన్నవరం అనిత అక్కడికక్కడనే మృతి చెందారు మృతదేహాన్ని కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు ఈ మేరకు పోలీసులు సంఘట స్థలానికి చేరుకొని భర్త గోపాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గంగిరెడ్డి యుగంధర్ రెడ్డి తెలిపారు.

## పర్సాపూర్‌లో పంచాయతీ, మహిళా సమాఖ్య భవనాలకు శంకుస్థాపన



**మద్దూరు, అక్టోబర్ 5 (జనంసాక్షి):** మద్దూరు మండలం పర్సాపూర్‌లో కాడా (CADA) స్పెషల్ నిధులతో మంజూరైన గ్రామపంచాయతీ, మహిళా సమాఖ్య భవన నిర్మాణ పనులకు సోమవారం భూమిపూజ నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కొడంగల్ ఇన్‌చార్జి తిరుపతి రెడ్డి సహకారంతో ఈ భవనాలు మంజూరైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వంచర్ల బాలయ్య, పీఏసీఎస్ చైర్మన్ గూల్ల నరసింహులు, మాజీ జెడ్పీటీసీ రఘుపతి రెడ్డి, గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్ పాల్గొన్నారు.

## మద్యానికి బానిసై వృద్ధుడి ఆత్మహత్య



పాపన్నపేట, అక్టోబర్ 5 (జనంసాక్షి): పాపన్నపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని పొడ్చన్ పల్లి తండాకు చెందిన పాల్య అంత్రియా (68) అనే వృద్ధుడు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ వివరాల ప్రకారం, మృతుడు కొంతకాలంగా మద్యానికి బానిసగా మారి పిచ్చిగా ప్రవర్తిస్తూ కుటుంబీకులతో గొడవ పడుతున్నాడు. ఆదివారం సాయంత్రం మద్యం షాపు వద్దకు వెళ్లిన ఆయన రాత్రి ఇంటికి తిరిగి రాలేదు. సోమవారం ఉదయం తండా సమీపంలో చెట్టుకు ఉరివేసుకుని కనిపించాడు. మృతుడి కుమారుడు శ్రీను ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కల్వేర్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా బి. మచ్చేందర్



కల్వేర్, అక్టోబర్ 04 (జనంసాక్షి): కల్వేర్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా బి. మచ్చేందర్ నియమితులయ్యారు. పార్టీకి ఆయన అందిస్తున్న సేవలను గుర్తించి అధిష్ఠానం ఈ బాధ్యతలను అప్పగించింది. ఈ సందర్భంగా మచ్చేందర్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో యూత్ కాంగ్రెస్‌ను బలోపేతం చేస్తూ, యువత ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడుతానని పేర్కొన్నారు. మచ్చేందర్ నియామకం పట్ల స్థానిక కాంగ్రెస్ శ్రేణులు, యూత్ కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

# కంటికి రెప్పలా ట్రాఫిక్ నిబంధనలు పాటిద్దాం

- సురక్షితంగా ఇళ్లకు చేరుకుందాం
- సిద్దిపేట సీపీ రష్మి పెరుమాళ్

సిద్దిపేట బ్యూరో, అక్టోబర్ 05 (జనంసాక్షి): కోహెడ పోలీస్ స్టేషన్ పరిధిలోని శంకర్ నగర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాద స్థలాన్ని సిద్దిపేట సీపీ రష్మి పెరుమాళ్ సందర్శించి కారణాలను పరిశీలించారు. అనంతరం ఘటనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్హెచ్ఓను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లాలో పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలపై ఆందోళన వ్యక్తం చేసిన సీపీ, వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా ఇళ్లకు చేరుకోవాలని పలు కీలక సూచనలు చేశారు.

**సీపీ రష్మి పెరుమాళ్ జారీ చేసిన ముఖ్య సూచనలు:**

**హెల్మెట్ ధారణ:** ద్విచక్ర వాహనదారుడితో పాటు వెనుక కూర్చునే వ్యక్తి కూడా తప్పనిసరిగా నాణ్యమైన హెల్మెట్ ధరించాలి. తలకు తీవ్ర గాయాలవడం వల్లే అత్యధిక మరణాలు సంభవిస్తున్నాయి.

**ట్రిపుల్ రైడింగ్ నిషేధం:** బైక్‌పై ఇద్దరి కంటే ఎక్కువ మంది ప్రయాణించడం చట్టరీత్యా నేరం. దీనివల్ల వాహన నియంత్రణ కోల్పోయి ప్రమాదాలు జరుగుతాయి.

**డ్రైవింగ్‌పై దృష్టి:** ప్రయాణంలో సెల్ ఫోన్ మాట్లాడటం, అతివేగం, రాంగ్ రూట్ డ్రైవింగ్ ప్రాణాలకే ముప్పు తెస్తాయి.

**డ్రంక్ అండ్ డ్రైవ్:** మద్యం మత్తులో వాహనాలు నడిపితే భారీ జరిమానాలతో పాటు జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు.

**నిర్లక్ష్యపు పార్కింగ్:** రహదారులపై హజార్డ్ లైట్లు వేయకుండా నిర్లక్ష్యంగా వాహనాలు పార్కింగ్ చేస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు.

**పాదచారుల జాగ్రత్తలు:** జాతీయ, ప్రధాన రహదారులను దాటేటప్పుడు పాదచారులు ఇరువైపులా చూసుకుని, నిర్దేశిత ప్రదేశాల్లోనే రోడ్డు దాటాలి.



త్వరగా వెళ్లడం కంటే సురక్షితంగా ఇళ్లకు చేరుకోవడమే ముఖ్యాంశమని సీపీ స్పష్టం చేశారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, సురక్షిత ప్రయాణానికి పోలీస్ శాఖకు ప్రజలంతా సహకరించాలని పిలుపునిచ్చారు.

## ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమంలో చోరీ

- నగదు, బంగారు గొలుసు చోరీ

చేర్యాల, అక్టోబర్ 05 (జనంసాక్షి): సిద్దిపేట జిల్లా చేర్యాల వ్యవసాయ మార్కెట్ పాలకవర్గం ప్రమాణ స్వీకారం సోమవారం స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి వచ్చిన కొందరి నాయకుల జేబుల్లో ఉన్న నగదు, ఒకరి బంగారు గొలుసును దుండగులు కొట్టివేశారు. ఈ ఘటనపై చేర్యాల పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

## జీవుల తండాలో ఆధ్యాత్మికంగా భోగు బండార్ వేడుకలు



సిర్గాపూర్, అక్టోబర్ 5 (జనంసాక్షి): సిర్గాపూర్ మండలం జమ్లా తండా పంచాయతీ పరిధిలోని జీవుల తండాలో మాజీ సర్పంచ్ దివ్యభాయి చరణ్ ఆధ్వర్యంలో 'భోగు బండార్' మరియు భవానీ మాత మాలాధారణ స్వాములకు అన్నదాన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి పౌరాదేవి శేఖర్ మహారాజ్ ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, మాలాధారులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో నారాయణఖేడ్ మాజీ జెడ్పీటీసీ రాథోడ్ లక్ష్మీబాయి రవీందర్ నాయక్, బిఆర్ఎస్ నాయకుడు రాజు నాయక్, మోహన్ నాయక్, GMR టీమ్ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శేఖర్ మహారాజ్‌తో పాటు ముఖ్యులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం నిర్వహించిన మహా అన్నదానంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని భవానీ మాత ఆశీస్సులు పొందారు.

# నిధుల దుర్వినియోగం నిరూపిస్తే ప్రమాణానికి సిద్ధం

**ఆకునూరు సర్పంచ్ కొమ్ము రవి సవాల్**



చేర్యాల, అక్టోబర్ 05 (జనంసాక్షి): గ్రామాభివృద్ధిని చూసి ఓర్వలేకనే బీఆర్ఎస్ నాయకులు తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, రూపాయి నిధులు దుర్వినియోగం జరిగినట్లు నిరూపిస్తే ఆకునూరు శివాలయంలో ప్రమాణం చేయడానికి సిద్ధమని సర్పంచ్ కొమ్ము రవి సవాల్ విసిరారు. సోమవారం గ్రామ పంచాయ తీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ నేతల ఆరోపణలను కాంగ్రెస్ నాయకులు, పాలకవర్గం తీవ్రంగా ఖండించింది.

**గ్రామాభివృద్ధి పనుల వివరాలు...**

**రహదారులు & భవనాలు:** నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొమ్మూరి సహకారంతో రూ. 50 లక్షలతో సీసీ రోడ్లు, ఉపాధి హామీ పథకం (MGNREGS) కింద రూ. 30 లక్షలతో సీసీ రోడ్లు, 5 మహిళా సంఘాల భవనాలు నిర్మించామన్నారు.

**పెండింగ్ బిల్లుల చెల్లింపు:** గత బీఆర్ఎస్ పాలకవర్గం పెండింగ్‌లో పెట్టిన రూ. 9.50 లక్షల బిల్లులు, 'మన ఊరు-మన బడి' పెండింగ్ నిధులు రూ. 3.25 లక్షలు, ఉచిత వీధిదీపాల కరెంట్ బిల్లులు రూ. 8 లక్షలు తమ ప్రభుత్వంలోనే చెల్లించినట్లు స్పష్టం చేశారు.

**తాగునీరు & మౌలిక వసతులు:** గ్రామంలో తాగునీటి ఎద్దడి లేకుండా కొత్త పైపులైన్లు, మిషన్ భగీరథ గేట్ వాల్స్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు, ప్రభుత్వ పాఠశాలల సుందరీకరణ పనులు పూర్తి చేశామన్నారు.

**బీఆర్ఎస్ పాలనపై విమర్శలు...**

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దళితబంధు, బీసీ బంధు పథకాల పేరుతో ప్రజల నుంచి లక్షల రూపాయలు వసూలు చేశారని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి భూకబ్జాలకు పాల్పడ్డారని కొమ్ము రవి విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పార్టీలకతీతంగా పేదలందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని చెప్పారు. తప్పుడు ఆరోపణలు మాని, ఆధారాలు ఉంటే పంచాయతీ వద్ద బహిరంగంగా నిరూపించాలని, లేనిపక్షంలో పరువు నష్టం దావా వేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీటీసీ తాటికొండ వేణుగోపాల్, కోయినేని నర్సయ్య, చిగుళ్ల బాలరాజు పాల్గొన్నారు.

## రేవల్లి మండల మైనారిటీ సెల్ అధ్యక్షుడిగా ఎండీ. రఫీక్ ఏకగ్రీవ ఎన్నిక

**పాల్గొన్న వనపర్తి జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు ఆయుబ్ ఖాన్**



రేవల్లి, అక్టోబర్ 05 (జనంసాక్షి): రేవల్లి మండల ముస్లిం మైనారిటీ సెల్ అధ్యక్షుడిగా ఎండీ. రఫీక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండీ. సుల్తాన్ అలీ అధ్యక్షతన జరిగిన సమావేశానికి వనపర్తి జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడు అయూబ్ ఖాన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అయూబ్ ఖాన్ మాట్లాడుతూ.. మైనారిటీల అభివృద్ధి, సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం అందరూ ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. సుల్తాన్ అలీ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో వక్ఫ్ బోర్డు సభ్యుడు అబ్దుల్ సలీం, జిల్లా కార్యదర్శి పార్వతాలు, రేవల్లి సర్పంచ్ రాజయ్య, కాంగ్రెస్ నాయకులు బాల్ రెడ్డి, గురునాథ్ రెడ్డి, బండారు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# విధి నిర్వహణపై ప్రశ్నించిన ఉప సర్పంచ్‌పై దుర్భాషలు

- అంగన్‌వాడీ టీచర్‌పై చర్యలకు డిమాండ్





ఉప్పునుంతల, (జనంసాక్షి): విధి నిర్వహణ తీరుపై ప్రశ్నించిన దాసర్లపల్లి గ్రామ ఉప సర్పంచ్ పానగంటి శంకర్‌ను అంగన్‌వాడీ టీచర్ పార్వతమ్మ కులపేరుతో కించపరిచి దుర్భాషలాడిన ఘటన ఉప్పునుంతల మండలంలో చోటుచేసుకుంది. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి టీచర్‌పై శాఖాపరమైన, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గ్రామ పంచాయతీ పాలకవర్గం, గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

**ఘటన వివరాలు:**

అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు, గర్భిణులకు అందించే పాలు, గుడ్లు, పౌష్టికాహార పంపిణీతో పాటు రికార్డుల నిర్వహణ సరిగ్గా లేదని గ్రామసభలో ఫిర్యాదులు వచ్చాయి. దీంతో ఉప సర్పంచ్ శంకర్ అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి వివరాలు అడుగగా, టీచర్ పార్వతమ్మ తనను కులం పేరుతో దూషించి, రాజకీయ నాయకుల అండ ఉందంటూ బెదిరింపులకు పాల్పడినట్లు బాధితుడు ఆరోపించారు.

**ఎంపీడీవోకు ఫిర్యాదు:**

ఈ ఘటనపై ఉప సర్పంచ్ శంకర్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) వరుణ్ తేజ్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తూ సంబంధిత ఆధారాలు, ఫొటోలను అందజేశారు.

**అధికారుల స్పందన:**

**ఎంపీడీవో వరుణ్ తేజ్:** ఫిర్యాదు ఆధారంగా అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి పూర్తి వివరాలు సేకరిస్తామని, ఆరోపణలు నిజమని తేలితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

**సీడీపీవో ధమయంతి:** రికార్డులను పరిశీలించి, విచారణ అనంతరం ఆరోపణల్లో వాస్తవం ఉంటే చట్టపరమైన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. అంగన్‌వాడీ కేంద్రం నిర్వహణపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి న్యాయం చేయాలని గ్రామ ప్రజలు అధికారులను కోరుతున్నారు.

## సగర మహిళా కమిటీ రాష్ట్ర అధ్యక్షురాలిగా అతినారపు విజయలక్ష్మి

- తెలకపల్లి మహిళకు రాష్ట్రస్థాయి బాధ్యతలు



తెలకపల్లి, అక్టోబర్ 5 (జనంసాక్షి): తెలంగాణ సగర మహిళా కమిటీ రాష్ట్ర అధ్యక్షురాలిగా తెలకపల్లి మండలానికి చెందిన అతినారపు విజయలక్ష్మి నియమితులయ్యారు. సగర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పరి శేఖర్ సగర ఆమెకు ఈ బాధ్యతలు అప్పగించారు. మండల మహిళకు రాష్ట్రస్థాయి కీలక బాధ్యత దక్కడం పట్ల స్థానిక సగర సంఘం నాయకులు, సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సగర మహిళలను సంఘటితం చేస్తూ సంఘాన్ని బలోపేతం చేస్తానని, మహిళల సమస్యల పరిష్కారం, సంక్షేమం మరియు సామాజిక అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు.

# రామాయంపేట సీహెచ్‌సీలో దంత వైద్య సేవలు ప్రారంభం



- గవర్నర్ పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన ఎంపీ

**రామాయంపేట, అక్టోబర్ 5 (జనంసాక్షి):** రామాయంపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)లో మెదక్ పార్లమెంట్ సభ్యుడు రఘునందన్‌రావు సోమవారం దంత వైద్య సేవలను ప్రారంభించారు. తన సొంత నిధులతో కొనుగోలు చేసిన డెంటల్ చైర్‌ను ఆసుపత్రికి అందజేసి, అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే పేద ప్రజలకు మెరుగైన దంత వైద్య సేవలు అందించడమే తమ లక్ష్యమని ఎంపీ తెలిపారు.

**గవర్నర్ పర్యటన ఏర్పాట్ల పరిశీలన...**

రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్ల రామాయంపేట పర్యటనకు వస్తున్న నేపథ్యంలో చేపడుతున్న ఏర్పాట్లను ఎంపీ అధికారులతో కలిసి పరిశీలించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదిన వేడుకల్లో భాగంగా సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు 'సేవా సంకల్ప్ అభియాన్' నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

**30 వేల కాజూ మొక్కల నాటే కార్యక్రమం...**

పర్యావరణ పరిరక్షణలో భాగంగా రామాయంపేట నుండి సిద్దిపేట వరకు 765 డీజీ జాతీయ రహదారికి ఇరువైపులా సుమారు 43 కిలోమీటర్ల మేర 30 వేల జీడిమామిడి (ఖుంప్పవృ) మొక్కలు నాటే కార్యక్రమాన్ని త్వరలో చేపట్టనున్నట్లు తెలిపారు. గవర్నర్ చేతుల మీదుగా ప్రారంభించనున్న ఈ మొక్కల నాటే కార్యక్రమ స్థలాలను, భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. మారుతున్న వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఆర్డీఓ రమాదేవి, తహసీల్దార్ రజినీకుమారి, తూప్రాన్ డీఎస్పీ నరేందర్, సీఐ సైదానాయక్, సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ లింబాద్రి, బీజేపీ పట్టణ అధ్యక్షుడు శీలం అవినాష్ రెడ్డి, పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# న్యాయవాదులపై దాడులను అరికట్టాలి

- బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వీరమల్లయ్య






**చేర్యాల, అక్టోబర్ 05 (జనంసాక్షి):** చేర్యాల కోర్టు పరిధిలో న్యాయవాది గూడెపు శ్రీధర్ పై దాడిని ఖండిస్తూ సోమవారం చేర్యాల బార్ అసోసియేషన్ కోర్టు విధులు బహిష్కరించి న్యాయవాదుల దాడులపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆరెళ్ల వీర మల్లయ్య మాట్లాడుతూ.. చేర్యాల కోర్టు పరిధిలోని నాగపురి గ్రామంలో న్యాయవాది గూడెపు శ్రీధర్ ఇంటిపై దుండగులు దాడి చేసి కారు అద్దాలు ధ్వంసం చేసి ఆస్తి నష్టం చేసి చంపుతానని ప్రయత్నించిన దుండగులు పై కఠిన చర్యలు తీసుకోవాలని దాడిని ఖండించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి మెరుగు రమేష్, సీనియర్ న్యాయ వాదులు భూమిగారి మనోహర్, న్యాయ వాదులు పొన్నం సురేష్, నల్గొండ సంతోష్, తాటికొండ ప్రణీత్, గుస్స వెంకటేష్, పర్వతం రాములు, మోకు రాజిరెడ్డి, నీరటి రాజ లింగం, దర్శనం ప్రశాంత్, అంకటి సురేం దర్, బైరగోని ప్రసాద్, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సంక్షేమాన్ని పట్టించుకోని మంత్రి జూపల్లి



- బీజేపీ నాయకుడు సాయి కృష్ణ గౌడ్ విమర్శ

**కొల్లాపూర్, అక్టోబర్ 5 (జనంసాక్షి):** ప్రజల సమస్యలను వెలుగులోకి తెస్తూ ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభంగా నిలుస్తున్న జర్నలిస్టుల సంక్షేమాన్ని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పూర్తిగా విస్మరించారని బీజేపీ నాయకుడు, సింగోటం ఉప సర్పంచ్ తమటం సాయి కృష్ణ గౌడ్ తీవ్రంగా విమర్శించారు. కొల్లాపూర్ నియోజకవర్గ కేంద్రంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు.

**30 ఏళ్ల రాజకీయ ప్రస్థానంలో జర్నలిస్టులకు చేసిందేమీ లేదు...**

ఆరుసార్లు ఎమ్మెల్యేగా, మూడుసార్లు మంత్రిగా పనిచేసిన జూపల్లి కృష్ణారావు ఎదుగుదలలో స్థానిక మీడియా పాత్ర కీలకమైనదని గుర్తుచేశారు. కానీ, తన 30 ఏళ్ల రాజకీయ ప్రస్థానంలో కొల్లాపూర్ జర్నలిస్టులకు ఇండ్లు కానీ, ఇండ్ల స్థలాలు కానీ కేటాయించకపోవడం దారుణమన్నారు. ఇతర ప్రాంతాల్లో జర్నలిస్టులకు స్థలాలు ఇస్తుంటే, కొల్లాపూర్‌లో మాత్రం కనీసం ఒక ప్రెస్ క్లబ్ కూడా లేకపోవడం మంత్రి నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆరోపించారు.

**రోడ్లు, చెట్ల కింద కూర్చుని వార్తలు రాసే దుస్థితి...**

సమావేశాలు నిర్వహించుకోవడానికి, వార్తలు రాసుకోవడానికి సరైన వసతి లేక జర్నలిస్టులు రోడ్ల మీద, చెట్ల కింద కూర్చోవాల్సిన అత్యంత దయనీయ పరిస్థితి నెలకొందని సాయి కృష్ణ గౌడ్ ఆందోళన వ్యక్తం చేశారు. మంత్రి ఇప్పటికైనా స్పందించి జర్నలిస్టుల కష్టాలను వినాలని హితవు పలికారు. వెంటనే కొల్లాపూర్ నియోజకవర్గంలోని ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులకు ప్రభుత్వ పరంగా ఇండ్ల స్థలాలు కేటాయించి, పక్కా గృహాల నిర్మాణానికి ఆర్థిక సాయం అందించాలని ఆయన కొల్లాపూర్ జర్నలిస్టుల తరపున డిమాండ్ చేశారు.

### కంసానిపల్లిలో అదనంగా

# అంగన్వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలి

**ఎస్సీలకు అంగన్వాడీ టీచర్ పోస్టు కేటాయించాలి**



**ఉప్పునుంతల (జనంసాక్షి):** మండల పరిధిలోని కంసానిపల్లి గ్రామంలో దళితులు, ఎస్సీలకు ప్రయోజనం కలిగేలా రెండో విడతలో అదనంగా అంగన్వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, ఎస్సీలకు అంగన్వాడీ టీచర్ పోస్టును కేటాయించాలని కోరుతూ సోమవారం ప్రజావాణిలో ఎంపీడీవో, డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసినట్లు సీపీఎం మండల కార్యదర్శి చింతల నాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా చింతల నాగరాజు మాట్లాడుతూ.. అంగన్వాడీ టీచర్ పోస్టుల కేటాయింపులో రోస్టర్ విధానం ద్వారా దళితులు, ఎస్సీలకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆరోపించారు. కంసానిపల్లి గ్రామంలోని ఎస్సీలకు న్యాయం జరిగేలా రెండో విడతలో అదనంగా అంగన్వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేసి, ఎస్సీ కేటగిరీకి అంగన్వాడీ టీచర్ పోస్టును కేటాయించాలని కోరారు. ఇప్పటికైనా శిశు సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు స్పందించి కంసానిపల్లి గ్రామానికి అదనంగా అంగన్వాడీ కేంద్రం, టీచర్ పోస్టును మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# వయోవృద్ధుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి: జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్




**గద్వాల నడిగడ్డ, ఆగస్టు 5(జనంసాక్షి);** వృద్ధుల జీవిత అనుభవాలు, విలువలు నేటి తరానికి ఎంతో మార్గదర్శకమని జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పేర్కొన్నారు. గద్వాలలోని బాల భవన్‌లో జిల్లా వయోవృద్ధుల సంక్షేమ, గ్రామీణ అభివృద్ధి, వైద్య ఆరోగ్య శాఖల ఆధ్వర్యంలో సోమవారం అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు.

**వృద్ధుల హక్కులు & వసతులు:**

**న్యాయ రక్షణ:** సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ యాక్ట్ 2007 ప్రకారం పిల్లలకు ఆస్తులు ఇచ్చిన తర్వాత వారు తల్లిదండ్రులను పట్టించుకోకపోతే, ఆ ఆస్తులను తిరిగి పొందే అవకాశం ఉందన్నారు.

**ఆర్థిక సాయం:** 65 ఏళ్లు దాటిన వృద్ధ మహిళలకు కూడా మహిళా సంఘాల ద్వారా ప్రభుత్వం రుణాలు అందిస్తోందని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

**వసతుల కల్పన:** గద్వాల స్మృతి వనంలో యోగా షెడ్ నిర్మాణంతో పాటు రెడ్ క్రాస్ భవనంలో రిక్రియేషన్ సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. వృద్ధులకు ఏవైనా ఇబ్బందులు ఎదురైతే నేరుగా అధికారులను లేదా తనను సంప్రదించవచ్చని భరోసా ఇచ్చారు.

అనంతరం వివిధ రంగాల్లో విశేష కృషి చేసిన వయోవృద్ధులను కలెక్టర్ ఘనంగా సన్మానించారు. సీనియర్ సిటిజన్స్ హక్కులు-చట్టాలపై రూపొందించిన పుస్తకాలను విడుదల చేసి, ఆటల పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సెర్ప్ స్టేట్ ప్రాజెక్ట్ మేనేజర్లు గిరిజా కళ్యాణి, మైథిలి, డిడబ్ల్యూఓ సునంద, డీఎంహెచ్ఓ సంధ్య కిరణ్మయి, ఏపీడీ శ్రీనివాస్, సీనియర్ సిటిజన్స్ ఫోరం జిల్లా అధ్యక్షుడు మోహన్ రావు పాల్గొన్నారు.

# విడతల వారీగా పట్టణ సమస్యల పరిష్కారం

- ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి



**జడ్చర్ల, అక్టోబర్ 5 (జనంసాక్షి):** మున్సిపాలిటీలోని ప్రతి వార్డును అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని, మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యమిస్తూ మురుగునీటి పారుదల, సీసీ రోడ్లు, తాగునీటి సమస్యలను విడతల వారీగా పరిష్కరిస్తామని ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి స్పష్టం చేశారు. మున్సిపాలిటీ 8వ వార్డు (హౌసింగ్ బోర్డ్)లో సీసీ రోడ్డు పనులకు సోమవారం ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని, గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో నాయకులు, అధికారులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

### పరిశుభ్రతే లక్ష్యంగా

# అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు



**తెలకపల్లి, అక్టోబర్ 5 (జనంసాక్షి):** తెలకపల్లి మేజర్ గ్రామపంచాయతీ 10వ వార్డులో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను వార్డు సభ్యుడు కొమ్ము రాకేష్ సోమవారం ప్రారంభించారు. కాలనీని పరిశుభ్రంగా ఉంచడంతో పాటు మురుగు నీటి నిల్వలను నివారించి డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు వ్యాపించకుండా ఈ పనులు చేపట్టినట్లు తెలిపారు. ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో వార్డు సభ్యుడు సొంటె మల్లేష్, గ్రామ నాయకులు కొమ్ము ఆనంద్, పవన్, లక్ష్మణ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

### రూ.48 కోట్లతో

# బిటి రోడ్డు పనులు ప్రారంభం



బిల్లులు నిలిచిపోయినప్పటికీ కాంట్రాక్టర్ కాంతారావు ముందుకొచ్చి రోడ్డు పనులు ప్రారంభించడం అభినందనీయమని ఆయనను ఎమ్మెల్యే సునీతా రెడ్డి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉప సర్పంచుల ఫోరం అధ్యక్షుడు పవన్‌కుమార్ గుప్తా, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ గొర్రె వెంకట్‌రెడ్డి, సర్పంచులు ప్రవీణ్‌గౌడ్, నారాయణరావు, బానోత్ కవిత, మాజీ ఎంపీటీసీ నర్సింగ రావు, బీఆర్ఎస్ నాయకులు మర్రి మహేందర్‌రెడ్డి, రాజశేఖర్‌గౌడ్, జగన్‌రెడ్డి, లాయక్, వార్డు సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జాతీయ రహదారిపై మురుగు నీరు ప్రవాహం



సంగారెడ్డి చౌరస్తా నుంచి పటాన్చెరు, జహీరాబాద్, శంకర్‌పల్లి, కలెక్టర్ కార్యాలయానికి వెళ్లాలన్న నిత్యం సంగారెడ్డి చౌరస్తా నుంచి వెళ్లాల్సి ఉంటుంది. రోజు అనేక మంది అధికారులు, ప్రజా ప్రతినిధులు అటువైపు నుంచి వెళ్తున్న ఏ ఒక్కరు కూడా పట్టించుకోకపోవడం ఏమిటని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. డ్రైనేజీ వాటర్ లీకేజీ తో బస్ స్టాప్ ఆవరణలో దుర్గంధం వాసన వస్తుందని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. జనప్రియ హోటల్ ఎదురుగా డ్రైనేజీ వాటర్ లీక్ కావడంతో గుంతగా ఏర్పడి అందులో నుంచి మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తుందని వెంటనే సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

# పేద కుటుంబాలకు ప్రభుత్వం అండ

- 72 మందికి కళ్యాణలక్ష్మి చెక్కుల అందజేత



మక్తల్, అక్టోబర్ 05 (జనంసాక్షి): పేద కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని మక్తల్ మున్సిపల్ చైర్మన్ వాకిటి మానస హన్మంతు అన్నారు. మక్తల్ ఎంపీడీవో కార్యాలయంలో మంత్రి డా. వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 72 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు పేద కుటుంబాలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని అన్నారు. ఆడపిల్లల వివాహానికి ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయం పేద కుటుంబాలకు ఎంతో అండగా నిలుస్తోందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వాకిటి మానస హనుమంతు, తహసీల్దార్ ఈ. సతీష్ కుమార్, ఎంపీడీవో, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కట్టా సురేష్ కుమార్ గుప్తా, ఏఎంసీ వైస్ చైర్మన్ బి. గణేష్ కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, గుడిగండ్ల సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, వివిధ గ్రామాల సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

# బాలానగర్‌లో ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి విస్తృత పర్యటన

- పరామర్శలు, ప్రారంభోత్సవాలు, చేరికలు

బాలానగర్, అక్టోబర్ 5 (జనంసాక్షి): బాలానగర్ మండలంలో స్థానిక ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి సోమవారం విస్తృతంగా పర్యటించారు. పర్యటనలో భాగంగా లారీ అసోసియేషన్ కార్యాలయ ప్రారంభోత్సవం, బాధితుల పరామర్శలు, కాంగ్రెస్ పార్టీ చేరికల కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు.

**లారీ అసోసియేషన్ కార్యాలయం ప్రారంభం...**

బాలానగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన లారీ అసోసియేషన్ కార్యాలయాన్ని ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా లారీ యజమానులు, డ్రైవర్లు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లగా, వాటిని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

**అనారోగ్యంతో ఉన్న పలువురికి పరామర్శ...**

**శ్రీహరి బాలానంద స్వామీజీ:** గౌతాపూర్ గుట్టపై వెలసిన శ్రీ విజయలక్ష్మీ నరసింహస్వామి ఆలయ పీఠాధిపతి శ్రీహరి బాలానంద స్వామీజీకి ఇటీవల హెర్నియా ఆపరేషన్ జరగడంతో ఎమ్మెల్యే ఆయను పరామర్శించి ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు.



**నాయకుడు మల్లారెడ్డి:** ఆపరేషన్ చేయించుకున్న గౌతాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు మల్లారెడ్డిని పరామర్శించి, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

**చాకలి లింగం:** ద్విచక్ర వాహనం ఢీకొని కాలు విరిగిన చాకలి లింగాన్ని పరామర్శించి, వైద్య చికిత్స వివరాలు అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారు.

**కాంగ్రెస్ పార్టీలోకి భారీగా చేరికలు...**

పెద్దారెవెల్లి గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో వివిధ వర్గాలకు చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరగా, ఎమ్మెల్యే వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యకర్తలంతా ప్రజలకు అందుబాటులో ఉంటూ పార్టీ బలోపేతానికి, సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బాలానగర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శంకర్ నాయక్, స్థానిక నాయకులు, కార్యకర్తలు, లారీ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.





# ప్రజావాణి ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా
- ప్రజావాణికి 100 పిర్యాదుల స్వీకరణ




మహబూబ్ నగర్ బ్యూరో, అక్టోబర్ 05 (జనంసాక్షి): ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులకు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి హరిప్రియ తో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా అర్జీదారుల సమస్యలను కలెక్టర్ సావధానంగా విన్నారు. ప్రతి సమస్యను జాగ్రత్తగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వారికి భరోసా ఇచ్చారు. అధికారులు ప్రజావాణి దరఖాస్తులను క్షుణ్ణంగా చదివి అర్థంచేసుకుని క్షేత్ర స్థాయిలో పరిశీలించి సత్వరం పరిష్కరించాలని అన్నారు. ప్రజావాణిలో పంచాయతీరాజ్, మున్సిపల్, నీటిపారుదల, జిల్లా సంక్షేమం, వ్యవసాయం, పౌరసరఫరాల శాఖ, భూ సర్వే రికార్డులు, గృహ నిర్మాణం, రోడ్లు రవాణా, పోలీస్, గిరిజన అభివృద్ధి శాఖ, విద్యుత్ శాఖ, విద్య, వైద్య ఆరోగ్యం , మైనింగ్, అటవీ, గ్రామీణ అభివృద్ధి, తదితర శాఖలకు సంబంధించిన మొత్తం 100 వినతులను అధికారులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డి.ఆర్.ఓ ఎ. నిర్మల, భూసేకరణ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ రామ్ రెడ్డి, జెడ్. పి. సి. ఈ.ఓ, ఇంచార్జి డి. పి. ఓ వెంకట రెడ్డి, డి.ఆర్.డి.ఓ నరసింహులు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎండిపోయిన పంటలను పరిశీలించిన ఎమ్మెల్యే

ఈ సందర్భంగా ఎమ్మెల్యే రైతులతో మాట్లాడగా విద్యుత్ సక్రమంగా అందక పెట్టుబడులు పెట్టినా పంటలు ఎండిపోయాయని, ఒక్కొక్కరం రెండు నుంచి మూడు ఎకరాల వరకు నష్టపోయామని రైతులు ఎమ్మెల్యేకు తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి వ్యవసాయ అధికారులకు ఫోన్ చేసి పంటలను పరిశీలించి నష్టపోయిన రైతుల పేర్లతో జాబితా రూపొందించి, ఉన్నత అధికారులకు నివేదిక అందించాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇది దొంగ ప్రభుత్వం అని సింగరేణి బొగ్గును అమ్ముకుంటూ నాణ్యత లోపించిన బొగ్గుతో విద్యుత్ తయారు చేయడంతో లో ఓల్టేజి సమస్యలు ఉత్పన్నమై ట్రాన్స్ ఫార్మర్లు అలాగే మోటర్లు కాలిపోతున్నాయని చెప్పారు. గత ప్రభుత్వం రైతులకు 24 గంటల విద్యుత్ అందించిందని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక కనీసం 6 నుంచి 7 గంటలు సక్రమంగా విద్యుత్ సరఫరా చేయలేకపోతుందని, దీంతో వందనాలు ఎకరాలలో పంటలు ఎండిపోతున్నాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. పంటలు చివరి దశలో ఉన్నందున నాణ్యమైన 24 గంటల విద్యుత్ అందించాలని, విద్యుత్ సమస్యతో పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25 వేల చొప్పున పరిహారం చెల్లించాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే రైతుల పక్షాన బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపడతామని సునీత రెడ్డి హెచ్చరించారు. ఎమ్మెల్యే వెంట ఉప సర్పంచుల ఫోరం అధ్యక్షుడు పవన్‌కుమార్ గుప్తా, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ గౌరి వెంకట్‌రెడ్డి, సర్పంచులు ప్రవీణ్‌గౌడ్, నారాయణరావు, బానోత్ కవిత, బీఆర్ఎస్ నాయకులు నర్సింగ రావు, మర్రి మహేందర్‌రెడ్డి, రాజశేఖర్‌గౌడ్, జగన్‌రెడ్డి, లాయక్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# దళిత విద్యార్థికి పరీక్ష నిరాకరణ - కాలేజీ యాజమాన్యంపై చర్యలకు డిమాండ్

మహబూబ్‌నగర్ ప్రతినిధి, అక్టోబర్ 05(జనంసాక్షి): పాలమూరు యూనివర్సిటీ పరిధిలోని అల్మదీనా కళాశాలలో వీ.జు.ఎ. చదువుతున్న దళిత విద్యార్థి బి. పురుషోత్తమ్‌కు హాల్‌టికెట్ ఇవ్వకుండా పరీక్షకు అనుమతించకపోవడాన్ని ఐక్య విద్యార్థి సంఘాలు తీవ్రంగా ఖండించాయి. స్కాలర్‌షిప్ దరఖాస్తు చేయలేదని, ఫీజు చెల్లించలేదనే నెపంతో విద్యార్థి ఎంత వేడుకున్నా ప్రిన్సిపాల్, యాజమాన్యం కనికరించకపోవడం దారుణమని పేర్కొన్నాయి.

కేవలం ఫీజు కారణంతో దళిత విద్యార్థి భవిష్యత్తును నాశనం చేసిన కళాశాల యాజమాన్యంపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని పాలమూరు యూనివర్సిటీ రిజిస్ట్రార్, ఎస్సీ/ఎస్టీ సెల్ డైరెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. బాధితుడికి న్యాయం జరగకపోతే యూనివర్సిటీ అడ్మినిస్ట్రేటివ్ భవనాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.



ఈ నిరసనలో ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సందే కార్తీక్ మాదిగ, పవన్ స్వేరో, సాయి అభినయ్, ఉదయ్ (AISF), కమలాకర్ మాదిగ తది తరులు పాల్గొన్నారు.

# అక్రమార్కులకు అండగా అధికారులు

- కొండలు కొట్టి నెంబర్ ప్లేట్ లేని ట్రాక్టర్లలో కట్టుడు రాయి తరలింపు
- బిజినేపల్లి మండలంలో జోరుగా మైనింగ్ చేస్తున్నా పట్టని వైనం





బిజినేపల్లి, అక్టోబర్ 5 (జనంసాక్షి): మండలంలోని లట్టుపల్లి, శాయిన్ పల్లి, మామ్మాయిపల్లి, గంగారం గ్రామాల పరిధిలో ఉన్న కొండలను అక్రమార్కులు పిండి చేస్తున్నారు. ప్రభుత్వ విద్యుత్తు అక్రమంగా వినియోగించుకుంటూ, భాస్టింగులతో వన్య ప్రాణులకు ముప్పు తెచ్చి పెట్టడమే కాకుండా ప్రకృతి వినాశనానికి పాల్పడుతున్నారు. ఇదంతా అధికారులు చూస్తూ ఉన్నా అక్రమార్కుల కాసులకు కక్కుర్తి పడి తమకేమీ సంబంధం లేదనట్టుగా ఉంటున్నారు. గత కొన్ని రోజులుగా వివిధ వార్తా కథనాలు వెలువడుతున్నా తమ జేబుకు చిల్లు పడుతుందేమోనని గుట్టు చప్పుడు కాకుండా ఉన్నారు. రాళ్ళ తరలింపుపై రెవెన్యూశాఖ అధికారులతో పాటు, ఆయా శాఖ అధికారులు కేవలం రెండు రోజులు తమ సమయాని కేటాయిస్తే ఒకొక్క అక్రమార్కుడి నుండి రూ. కోట్లల్లో రాయల్టీ కింద వసూళ్లు చేసి ప్రభుత్వ ఖజానా నింపవచ్చు. కానీ అధికారులు ప్రభుత్వ ఖజానా నింపడం కంటే తమ జేబులు నింపుకోవడానికి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నట్టుగా స్పష్టంగా కనిపిస్తుంది.

# సీపీఎం పార్టీకి అండగా నిలిచిన సంబు నారమ్మ సేవలు చిరస్మరణీయం: పి. మధు




వీపనగండ్ల, అక్టోబర్ 6(జనంసాక్షి): వీపనగండ్ల మండల కేంద్రానికి చెందిన సంబు నారమ్మ సంస్మరణ సభను సోమవారం నరసింహ నగర్‌లో సీపీఎం మండల కార్యదర్శి బాల్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ రాజ్యసభ సభ్యులు పి. మధు, సీపీఎం తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాన్ వెస్లీ, ప్రొఫెసర్ రామచందర్ హాజరై మాట్లాడారు. సంబు నారమ్మ తన పిల్లలను అభ్యుదయ భావజాలం వైపు ప్రోత్సహించడమే కాకుండా, సీపీఎం పార్టీ కార్యక్రమాలకు నిరంతరం అండగా నిలిచారని నాయకులు కొనియాడారు. పేదల సమస్యల పరిష్కారానికి పోరాటాలు కొనసాగించడమే నారమ్మకు నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు, జబ్బార్, రాంరెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు సత్యనారాయణ గౌడ్, కాంగ్రెస్ నాయకుడు బస్వరాజ్ గౌడ్, జనవిజ్ఞాన వేదిక (జేవీవీ), యూటీఎఫ్ నాయకులు, కుటుంబ సభ్యులు మరియు ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# మూగజీవాల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం పెద్దపీట

- ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**మహబూబ్‌నగర్, బ్యూరో అక్టోబర్ 05 (జనంసాక్షి):** గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు మూలస్తంభాలైన పాడి రైతులకు అండగా నిలుస్తూ మూగజీవాల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువుల వ్యాధి నిర్ధారణ, శాంపిల్స్ సురక్షిత రవాణా కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనాన్ని (TS09UC4288) జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తాతో కలిసి ఆయన సోమవారం జెండా ఊపి ప్రారంభించారు.

**సకాలంలో సేవలు - జాప్యానికి చెక్...**

ఈ సందర్భంగా విప్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. గ్రామాల్లో పశువులకు అకస్మాత్తుగా వ్యాధులు సోకినప్పుడు వ్యాధి నిర్ధారణలో జరిగే జాప్యం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. క్షేత్రస్థాయి నుంచి రక్తం, మూత్రం వంటి నమూనాలను శాస్త్రీయంగా సేకరించి, పాడవకుండా ప్రయోగశాలలకు వేగంగా తరలించేందుకు ఈ ప్రత్యేక వాహనం ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

**వేగవంతమైన ల్యాబ్ పరీక్షలు: కలెక్టర్ ఖుష్బూ గుప్తా**

జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ.. సేకరించిన నమూనాలను ల్యాబ్‌లో త్వరితగతిన పరీక్షించి, ఫలితాలను వెంటనే పశువైద్యులకు చేరవేసేలా సమర్థవంతమైన సమన్వయ వ్యవస్థను ఏర్పాటు చేశామని తెలిపారు. దీనిద్వారా సకాలంలో చికిత్స అందించడమే కాకుండా అంటువ్యాధులు



వ్యాప్తి చెందకుండా అరికట్టవచ్చని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, జిల్లా గొర్రెల కాపరుల సహకార సంఘం అధ్యక్షుడు శాంతన్న యాదవ్, పశుసంవర్ధక శాఖ అధికారులు, వైద్యులు, ప్రజాప్రతినిధులు మరియు రైతులు పాల్గొన్నారు.

## తరతరాలకి ఆదర్శం పండుగ సాయన్న

- ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి



**జడ్చర్ల, అక్టోబర్ 5 (జనంసాక్షి):** తెలంగాణ వీరుడు పండుగ సాయన్న చూపిన పోరాట పటిమ తరతరాలకి ఆదర్శమని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి అన్నారు. పేదలు, బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం సాయన్న చేసిన పోరాటాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని సిగ్నల్ గడ్డ వద్ద పండుగ సాయన్న విగ్రహ ఏర్పాటు పనులకు సోమవారం ఆయన భూమి పూజ చేశారు. జడ్చర్లలో విగ్రహాన్ని ప్రతిష్టించడం ద్వారా ఆయన వీర చరిత్రను భావితరాలకు పరిచయం చేసే అవకాశం కలుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, యువకులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుడి జ్ఞాపకంగా విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ



**మహమ్మదాబాద్,అక్టోబర్ 05 (జనంసాక్షి):** విద్యతోనే విద్యార్థుల్లో విజ్ఞానం, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని సర్పంచ్ మాణిక్యమ్మ, మాజీ సర్పంచ్ పద్మమ్మ, పంచాయతీ కార్యదర్శి కృష్ణవేణి పేర్కొన్నారు. బడుగు, బలహీన వర్గాల విద్యాభివృద్ధికి కృషి చేసిన దివంగత ఉపాధ్యాయుడు కొండమొల్ల వెంకటయ్య జయంతిని పురస్కరించుకుని సోమవారం గాదిర్యాల్ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు, పెన్సిళ్లను పంపిణీ చేశారు.

వెంకటయ్య సతీమణి పద్మమ్మ, కుమారుడు భరత్‌చంద్ర ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన నాయకులు విద్యార్థులకు విద్యా సామగ్రిని అందజేశారు. ఉపాధ్యాయ వృత్తికే అంకితమై విద్యార్థుల అభ్యున్నతికి వెంకటయ్య చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం రాములు, ఉపాధ్యాయులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## దొంగ సర్టిఫికెట్లపై చర్యలు తీసుకోవాలి

- మాల మహానాడు డిమాండ్



**ఆత్మకూర్, అక్టోబర్ 5 (జనంసాక్షి):** ఉమ్మడి ఆత్మకూరు మండలంలో లేని 'మాదాసి కురువ', 'మాదారి కురువ' కులాల పేరుతో దొంగ సర్టిఫికెట్లు పొందిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆత్మకూరు మాల మహానాడు డిమాండ్ చేసింది. సంఘం అధ్యక్షుడు ఎరుమల రఘు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో నాయకులు మాట్లాడారు. బీసీ–బి లోని కురుమ వర్గానికి చెందిన కొందరు వ్యక్తులు హైదరాబాద్ నుండి అక్రమంగా ఎస్సీ సర్టిఫికెట్లు పొంది, అసలైన ఎస్సీలకు దక్కాల్సిన రిజర్వేషన్లు, ఉద్యోగాలను హరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని, లేకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు జి. లింగన్న, పాపారాయుడు, రేవల్లి శ్రీనివాసులు, అజ్జపాగా మాసన్న తదితరులు పాల్గొన్నారు.

## ఇచ్చిన హామీని నెరవేర్చిన మాజీ ఎంపీపీ

- విద్యార్థులకు అండగా నిలిచిన తిప్పర్తి అరుణ నరసింహారెడ్డి



**ఉప్పునుంతల (జనంసాక్షి):** మండల కేంద్రంలోని గట్టు కాడిపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఇచ్చిన హామీని మాజీ ఎంపీపీ తిప్పర్తి అరుణ నరసింహారెడ్డి నెరవేర్చారు. గతంలో పాఠశాలను సందర్శించిన సందర్భంగా టేబుళ్ల, కుర్చీలు తన సొంత ఖర్చు తో అందజేస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం విద్యార్థుల అవసరాలను గుర్తించి సహాయం అందించడంతో గ్రామ ప్రజలు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని, ఆర్థిక ఇబ్బందులు విద్యార్థుల చదువుకు ఆటంకం కాకుండా సమాజంలోని ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని ఆయన పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చింతగల శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలు, విద్యార్థినీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## తిరుమలాపూర్ ప్రైవేటు పాఠశాల నిర్లక్ష్యం: పట్టించుకోని ఎంఈఓ

- పాత భవనం నుండి కొత్త భవనానికి మార్చడానికి ఎటువంటి అనుమతులు లేవు
- కొత్త భవనం అసంపూర్తిగా నిర్మాణం కానీ నర్సరీ, ఎల్ కేజీ, విద్యార్థులే ఎక్కువ
- పాఠశాల గంట కొట్టే ప్రదేశంలో వేలాడుతున్న విద్యుత్ తీగలు

**రాజాపూర్, అక్టోబర్ 5(జనంసాక్షి):** రాజాపూర్ మండల పరిధిలోని తిరుమలాపూర్ గ్రామంలో ఉన్న 'అను మోడల్ పాఠశాల' నిర్వాహకులు విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనల ప్రకారం ఒక భవనం నుండి మరొక భవనానికి పాఠశాలను మార్చాలంటే విద్యాశాఖ అనుమతి తప్పనిసరి. అయితే, ఎటువంటి అనుమతులు లేకుండానే ఈ పాఠశాలను అసంపూర్తిగా ఉన్న నూతన భవనంలోకి మార్చి తరగతులు నిర్వహిస్తున్నారు.

**ప్రమాదకరంగా పాఠశాల వాతావరణం:**

**అసంపూర్తి నిర్మాణాలు:** నూతన భవనంలో నర్సరీ, ఎల్కేజీ నుండి 5వ తరగతి వరకు దాదాపు 100 మందికి పైగా చిన్నారులు చదువుకుంటున్నారు. భవనానికి పై అంతస్తులో రేలింగ్ లేకపోవడం, మెట్లకు



ప్రహరీ గోడ అసంపూర్తిగా ఉండటం తీవ్ర ప్రమాదకరంగా మారింది.

**వేలాడుతున్న విద్యుత్ తీగలు:** పాఠశాల గంట కొట్టే ప్రదేశంలోనే ప్రమాదకర రీతిలో విద్యుత్ తీగలు వేలాడుతున్నాయి.

**అధికారుల తీరుపై అనుమానాలు:** పాఠశాల మార్పుపై ముందస్తు అనుమతులు లేవని, నోటీసులు జారీ చేశామని ఎంఈఓ చెప్తున్నప్పటికీ, గత 5 నెలలుగా ఎంఈఓ కార్యాలయానికి కూతవేటు దూరంలోనే నిబంధనలకు విరుద్ధంగా పాఠశాల నడుస్తున్నా కఠిన చర్యలు తీసుకోకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రైవేటు పాఠశాలలకు అధికారులే వత్తాసు పలికితే ప్రభుత్వ పాఠశాలల నిలదొక్కుకోవడం ఎలా అని స్థానిక ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## 300 కిలోల నల్లబెల్లం, పట్టిక పట్టివేత: నిందితులు పరారీ

**ఉప్పునుంతల (జనంసాక్షి):** నాటు సారాయి తయారీకి ఉపయోగించే నల్లబెల్లం, పట్టికను అక్రమంగా తరలిస్తున్న మారుతి జెన్ కారును ఉప్పునుంతల పోలీసులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై పుట్ట మహేష్ తెలిపిన వివరాల ప్రకారం.. కంసాన్‌పల్లి గ్రామ శివారులోని తిప్పాపూర్ తండా మట్టిరోడ్డు వద్ద బ్లూకోల్ట్ సిబ్బంది పెట్రోలింగ్ చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన కారును తనిఖీ చేసేందుకు వెళ్లారు. పోలీసులను చూసి వాహనంలో ఉన్న ఇద్దరు వ్యక్తులు కారును వదిలి పరారయ్యారు.

కారును సోదా చేయగా 10 సంచుల్లో 300 కిలోల నల్లబెల్లం, కిలో పట్టిక లభించాయి. వర్త్య రమేష్, పాత్లావత్ భరత్ అనే వ్యక్తులు వీటిని అధిక ధరలకు విక్రయించేందుకు తరలిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఏపీ–09–బీఏ–2356 నంబర్ గల కారుతో పాటు సరుకును స్వాధీనం చేసుకుని, పరారైన




వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## విద్యుత్ షాక్‌తో రైతు మృతి



**ఉర్కొండ, అక్టోబర్ 05 (జనంసాక్షి);** విద్యుత్ షాక్ తగిలి రైతు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది.నాగర్ కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలం రాచాలపల్లి శివారులోని కాలువలో నీటి మోటార్ సరిచేయబోయి తిమ్మన్నపల్లికి చెందిన రైతు శ్యామ్(39) విద్యుత్ షాక్కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రమాదవశాత్తు ఈ ఘటన జరిగినట్లు స్థానికులు తెలిపారు. మృతుడికి భార్య, నలుగురు కుమార్తెలు ఉన్నారు. శ్యామ్ మృతితో కుటుంబంలో విషాదం నెలకొంది. కలుపుగోలుగా ఉండే వ్యక్తి అకస్మాత్తుగా మరణించడంతో గ్రామంలో విషాదఛాయలు అలుము కొన్నాయి.

## పట్టపగలే చోరీ.. బంగారం, నగదు అపహరణ



**ధరూరు, అక్టోబర్ 5 (జనంసాక్షి):** జోగులాంబ గద్వాల జిల్లా ధరూర్ మండలం పెద్ద చింతరేవుల గ్రామంలో పట్టపగలే చోరీ చోటుచేసుకుంది.గ్రామానికి చెందిన తంబాళి నాగరాజు ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తుతెలియని దొంగ చొరబడి సుమారు రెండు తులాల బంగారు ఆభరణాలు, రూ. 90 వేల నగదును ఎత్తుకెళ్లాడు. చోరీ చేస్తుండగా స్థానికులు రావడాన్ని గమనించిన దొంగ భయంతో బైక్‌ను ఇంటి ముందే వదిలేసి పరారయ్యాడు.విషయం తెలుసుకున్న స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పరిసరాలను పరిశీలించి ఆధారాలు సేకరించారు. దొంగ వదిలి వెళ్లిన బైక్ ఆధారంగా నిందితుడిని గుర్తించే పనిలో ఉన్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.